ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 తమిళనాడు TAMILNADU

ఆదివారం 17 నవంబరు 2024



తాత్విక ధోరణిలో తిరువళ్లువర్, వేమన సమాజ పరిశీలన

● ద్రవిడ వర్సిటీ సహాయాచార్యులు డాక్టర్ హరికృష్ణ



సదస్సులో పాల్గొన్న విద్యావేత్తలు

అడయార్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లువర్, వేమన ఇద్దరూ ప్రజా కవులేనని, వారిద్దరూ సమాజాభ్యున్నతిని కాంక్షిస్తూ, సమాజాన్ని తాత్విక ధోరణిలో పరిశీలించారని కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయ సహాచార్యులు డాక్టర్ ఎం.హరికృష్ణ పేర్కొన్నారు. శనివారం పాలక్కాడ్‌లోని టీసీఆర్‌సీ, చెన్నై హిందీ ప్రచారక్ సంఘ్, డీఏవీ కాలేజ్ (అజ్మీర్), సేలంకు చెందిన తేళ ఎఫ్ఎం సహకారంతో రాజ్‌భవన్‌లో 'తిరువళ్లువర్, కబీర్ దాస్, యోగి వేమన' సారూప్యతపై జరిగిన అంతర్జాతీయ సాహితీ సదస్సును గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరుగనున్న ఈ సదస్సులో తొలి రోజు వివిధ అంశాలపై భాషా పండితులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా, ద్రావిడ విశ్వవిద్యాలయం సహాయాచార్యులు డాక్టర్ హరికృష్ణ 'తిరువళ్ళువర్ - వేమన ఆలోచనా ధోరణలు - సారూప్యత' అనే అంశంపై కీలక ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో యోగివేమన యూనివర్సిటీకి చెందిన ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి, డాక్టర్ అంబేడ్కర్ యూనివర్సిటీకి చెందిన ఆచార్య ఎల్బీ కృష్ణారెడ్డి కూడా పత్రసమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంకా ప్రొఫెసర్ ఎస్.లక్ష్మి అయ్యర్, డాక్టర్ కేటీ మురుగేశన్, ప్రొఫెసర్ సంజయ్ అరోరా, డాక్టర్ కల్పన, డాక్టర్ శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

ధర్మాచరణ ఎలుగెత్తి చాటేదే భారత్

గవర్నర్ ఆర్ఎన్ రవి



రాజ్‌భవన్‌లో అతిథులను సత్కరిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

చెన్నై, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భారత్ అంటే ధర్మాచరణ అని, భారత్ అనే పదం ఇండియా అనే పదానికంటే అత్యంత ప్రాచీనమైనదని గవర్నర్ ఆర్ఎన్ రవి పేర్కొన్నారు. శనివారం ఉదయం రాజ్‌భవన్‌లో 'తిరువళ్లువర్, కబీర్‌దాస్, యోగివేమన సాహిత్యాల్లో సారూప్యాలు' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారత్ అని పిలిచేటప్పుడు రాజకీయ దేశం కాదని, ఇండియా అని పిలిచేటప్పుడే రాజకీయ దేశం అనే భావన తెరపైకి వస్తుందన్నారు. మతాలన్నీ ఒక్కటే అని చెప్పటం రాజకీయం అయితే, ఒక్కో మతం వేర్వేరు సిద్ధాంతాలను కలిగి ఉంటుందని, ధర్మమే అన్నింటిని సమైక్యం చేస్తుంద న్నారు. మనమందరమూ ఒకే కుటుంబానికి చెందినవారమని ఎలుగెత్తి చాటేదే భారత్ అని, ఈ ఐకమత్యాన్నే తిరువళ్లువర్, కబీర్‌దాస్, యోగివేమన అనే మహాపురుషులు తమ రచనలు, సాహిత్యంలో నొక్కి వక్కాణించారన్నారు. నేటి విద్యావిధానంలో భారతం అంటే ఏమిటో భావితరాలకు చెప్పలేకపోతున్నామని గవర్నర్ ఆవేదన వ్యక్తం చేశారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

డిప్యూటీ సీఎం ఉదయనిధి



పారాలింపిక్‌లో వెండి పతకం గెలిచిన తులసిమదిని అభినందిస్తున్న డిప్యూటీ సీఎం ఉదయనిధి

ప్యారీస్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని ప్రతిభ కనబరిచే క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహిస్తుందని డిప్యూటీ సీఎం ఉదయనిధి పేర్కొన్నారు. చెంగల్పట్టు జిల్లా మహాబలిపురంలో వెటర్నరీ వైద్యుల సంఘం, జంతువుల శిక్షణా సంఘం సంయుక్తంగా శుక్రవారం ఏర్పాటుచేసిన 21వ అంతర్జాతీయ పెంపుడు జంతువుల సదస్సును మంత్రి ఉదయనిధి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన పారాలింపిక్ పోటీల్లో వెండి పతకం సాధించిన బాడ్మింటన్ క్రీడాకారిణి తులసిమదికి జ్ఞాపిక అందజేసిన మంత్రి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంచీపురం జిల్లాలో సాధారణ కుటుంబంలో జన్మించి తన ప్రతిభ ద్వారా క్రీడా కోటా కింద వెటర్నరీ సైన్స్ చదువుకుంటోందని, రాబోయే రోజుల్లో ఆమె అంతర్జాతీయస్థాయి పారాలింపిక్ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించి రాష్ట్రానికి మరింత ఘనత చేకూర్చాలని సూచించారు. 400 మంది వెటర్నరీ వైద్యులకు రూ.కోటి వ్యయంతో ప్రతిభ మెరుగుపరిచే శిక్షణ పథకాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. పెంపుడు జంతువులు వ్యాధుల బారిన పడకుండా వాటిని కాపాడేలా వెటర్నరీ వైద్యులు వ్యవహరించాలని ఉప ముఖ్యమంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి టీఎం అన్బరసన్, ఎంపీ, వెటర్నరీ వైద్యులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

30న రాష్ట్రానికి రాష్ట్రపతి



ద్రౌపది ముర్ము

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఈ నెల 30వ తేదీ రాష్ట్రంలో పర్యటించనున్నారు. తిరువారూరు సమీపంలో ఉన్న నీలకుడి తమిళనాడు కేంద్ర విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి ఆమె హాజరు కానున్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు రాష్ట్రపతి డిగ్రీలు ప్రదానం చేయనున్నట్లు వర్సిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ విషయమై వర్సిటీ ఉపకులపతి కృష్ణన్ మాట్లాడుతూ... రాష్ట్రపతి భద్రతా చర్యల కోసం వర్సిటీకి సంబంధించిన అన్ని కార్యకలాపాలను ఈ నెల 23 నుంచి రాష్ట్రపతి భద్రత ఏర్పాట్ల కమిటీకి అప్పగించనున్నామన్నారు. 30న ప్రత్యేక విమానంలో కోయంబత్తూర్ రానున్న రాష్ట్రపతి హెలికాప్టర్ ద్వారా నీలగిరి వెల్లింగ్టన్ సైనిక శిక్షణా కేంద్రంలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నారు. అక్కడి నుంచి మళ్లీ కోవై చేరుకొని హెలికాప్టర్ ద్వారా నీలకుడి కేంద్ర విశ్వవిద్యాలయ ప్రాంగణానికి చేరుకుంటారన్నారు. స్నాతకోత్సవం అనంతరం రాష్ట్రపతి హెలికాప్టర్‌లో కోవై వెళ్లి, అక్కడి నుంచి ఢిల్లీ తిరిగివెళ్తారు.

ఆటో - లారీ ఢీ

ముగ్గురి మృతి



మృతులు శక్తినాథన్, శివ, భూమేష్

చెన్నై, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లా పరమత్తివేలూరు తాలూకా జోడర్‌పాళయం వద్ద శనివారం వేకువ జామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు. శక్తినాథన్ (18), భూమేష్ (20), రమేష్, శివాతో కలిసి వెంగ్రై అనే ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ రమేష్ (30) సరకుల ఆటోలో శుక్రవారం రాత్రి ఈరోడ్ సమీపంలోని ఓ పెళ్ళిమంటపానికి సరకులు చేర్చి స్వస్థలానికి పయనమయ్యారు. శనివారం వేకువజాము 2 గంటల ప్రాంతంలో జోడర్‌పాళయం సమీపంలోని తన్నీర్‌పందర్ సమీపంలో ఎదురుగా పరమత్తి నుండి జోడర్‌పాళయం వైపు వచ్చిన లారీ అదుపు తప్పి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణించిన నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శక్తినాథన్, శివ మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స తర్వాత భూమేష్, రమేష్‌లను మెరుగైన చికిత్స కోసం నామక్కల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వెళతుండగా మార్గమధ్యంలో భూమేష్ మృతిచెందాడు. జోడర్‌పాళయం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

12న దళపతి రీ రిలీజ్



7లో 'అమరన్' ప్రదర్శిస్తున్న థియేటర్‌పై బాంబు దాడి



మాదక ద్రవ్యాల చెలామణికి చెక్

- విద్యాసంస్థల నుంచి 100 మీటర్లలో మూడు దుకాణాలే
- సీబీఐ, అధికారులతో పర్యవేక్షణ కమిటీ
- మద్రాసు హైకోర్టు ఆదేశం



చెన్నై, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాదకద్రవ్యాల చెలామణికి చెక్ పెట్టేందుకు హైకోర్టు పలు మార్గదర్శకాలు చేసింది. విద్యా సంస్థలకు కనీసం వంద మీటర్ల దూరంలో స్టేషనరీ, మెడికల్, నిత్యావసర వస్తువుల వంటి దుకాణాలు తప్ప ఇతర దుకాణాలుండకూడదని స్పష్టం చేసింది. ఈ మాదకద్రవ్యాలను అడ్డుకునేందుకు సీబీఐ, మాదకద్రవ్యాల విభాగాధికారులతో కూడిన ప్రత్యేక బృందాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేయాని ఆదేశించింది. నగరంలో గుడిసెలు తొలగించడాన్ని సవాల్ చేస్తూ 'పెన్నురిమై ఇయక్కం' హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దురైపాక్కం, పెరుంబాక్కం సహా నాలుగు ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ స్థలాలు ఇచ్చారని, అక్కడ మౌలిక వసతులు లేవని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై గతంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. నాలుగు ప్రాంతాల్లోని వసతులు పరిశీలించి నివేదిక సమర్పించాలని న్యాయవాదితో కూడిన బృందాన్ని నియమించింది. ఆ మేరకు ఈ బృందం నివేదిక దాఖలు చేసింది. గంజాయి, మాదకద్రవ్యాల సరఫరా యధేచ్ఛగా సాగుతోందని, ఆయా ప్రాంతాల్లో మాదకద్రవ్యాల పునరావాస శిబిరం ఏర్పాటుచేయాలని సూచించింది. ఈ నివేదికపై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో తాజాగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణన్‌కుమార్, న్యాయమూర్తి జస్టిస్ బాలాజీతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. 2022లో మాదకద్రవ్యాల తరలింపునకు సంబంధించి 19 మంది విదేశీయుల సహా 14,934 మందిపై పదివేల కేసులు, 2023లో మాదకద్రవ్యాలు తరలిస్తున్న ఘటనల్లో 14,770 మందిపై 10,256 కేసులు నమోదుచేసినట్లు అడిషినల్ అడ్వకేట్ జనరల్ రవీంద్రన్ తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు వరకు 9,750 మందిపై 6,053 కేసులు నమోదుచేసినట్లు వివరించారు. మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. 'మాదకద్రవ్య రహిత తమిళనాడు' అనే వెబ్‌సైట్, యాప్ కూడా ప్రారంభించినట్లు డీజీపీ తరఫున దాఖలుచేసిన అఫిడవిట్‌లో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. పొరుగు రాష్ట్రాల నుంచి కొరియర్ ద్వారా రాష్ట్రానికి మాదకద్రవ్యాలు సరఫరా అవుతున్నాయని, జిల్లా, తాలూకా స్థాయిలో మాదకద్రవ్యాల చెలామణి సర్వసాధారణమైపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. వీటి నియంత్రణకు ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, మాదకద్రవ్యాల తరలింపు, విక్రయాల నియంత్రణలో పోలీసులు చర్యలు చేపట్టినా, ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియమించాలని సూచించింది. ఈ బృందంలో మాదకద్రవ్యాల నిరోధక విభాగం అధికారి, సీబీఐ అధికారి, ప్రభుత్వ అధికారి కూడా వుండాలని స్పష్టం చేసింది. ఈ బృందంలో అధికారుల వివరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీల్డు కవరులో సమర్పించాలని ఆదేశించింది. విద్యాసంస్థల నిర్వాహకుల అంగీకారంతో స్టేషనరీ, మెడికల్, నిత్యావసర వస్తువుల దుకాణాలను ఏర్పాటుచేయవచ్చని, అవి మినహా పాఠశాలలు, కళాశాలల నుంచి వంద మీటర్ల దూరంలో ఇతర దుకాణాలకు అనుమతివ్వకూడదని తేల్చిచెప్పింది. మాదకద్రవ్యాల విక్రయాలపై ఫిర్యాదు చేసేందుకు పాఠశాల, కళాశాలల్లో టోల్ ఫ్రీ నెంబర్లతో బోర్డులు ఏర్పాటుచేయాలని, ఫిర్యాదు పెట్టె కూడా ప్రభుత్వం ఏర్పాటుచేయాలని సూచిస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదావేసింది.

947 కేంద్రాలలో ఓటర్ల జాబితా సవరణ



చెన్నై, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 16 శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన ఓటర్ల జాబితా సవరణ పనులు 947 కేంద్రాలలో శనివారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ కేంద్రాల వద్ద ఉదయం పది గంటల నుంచే ఓటర్లు తమ పేర్ల నమోదు, మార్పులు చేసుకోవటానికి బారులు తీరారు. వచ్చే యేడాది జనవరి ఒకటి నాటికి 18 యేళ్ల వయస్సు కలిగినవారంతా ఓటర్ల జాబితాలో పేర్లను నమోదు చేసుకునే దిశగా రాష్ట్ర ఎన్నికల సంఘం అక్టోబరు 29న ముసాయిదా ఓటరు జాబితా కూడా విడుదల చేసింది. ఆ నేపథ్యంలో ఈ నెలాఖరులోగా నాలుగు రోజులపాటు ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఆ ప్రకారం శనివారం ఉదయం తొలి శిబిరం ప్రారంభమైంది. ఆదివారం ప్రత్యేక శిబిరం కొనసాగుతుందని అధికారులు చెప్పారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి వివరాలు తెలుసుకునేందుకు, ఫిర్యాదులకు 0441950 అనే టోల్‌ఫ్రీ నెంబర్ కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇదే విధంగా శనివారం ఉదయం నుంచి సాయంత్రం దాకా రాష్ట్రమంతటా ఓటర్ల జాబితా ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు.

అయ్యప్ప దీక్షలు ప్రారంభం

- మాలాధారణ చేసిన అయ్యప్ప భక్తులు
- కిటకిటలాడిన ఆలయాలు



తిరుచెందూరు ఆలయంలో దీక్ష ప్రారంభిస్తున్న అయ్యప్ప భక్తులు - హొగేనకల్ కావేరి వాగు వద్ద మాల వేస్తున్న గురుస్వామి

చెన్నై, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభం కావటంతో రాష్ట్రంలోని అయ్యప్పస్వామి ఆలయాలు, శివాలయాలు మాల ధరించే భక్తులతో కిటకిటలాడాయి. శబరిమల ఆలయాన్ని మండలపూజ సందర్భంగా తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద అయ్యప్పభక్తుల మాలాధారణ ప్రారంభమైంది. తిరుచెందూరు కడలితీరంలో అయ్యప్ప భక్తులంతా స్నానమాచరించి, నలుపురంగు దుస్తులు ధరించి ఆలయ ప్రాంగణం, తూండుకై వినాయక స్వామి గుడి వద్ద గురుస్వాముల ద్వారా తులసిమాలలు ధరించారు.

హొగేనకల్ వద్ద..

ధర్మపురి జిల్లా హొగేనకల్ జలపాతం సమీపంలో కావేరి వాగు వద్ద అయ్యప్ప భక్తులు తమ వ్రతదీక్షలను ప్రారంభించారు. కావేరి నదిలో స్నానమాచరించి, నలుపు దుస్తులు ధరించి గురుస్వాముల నుండి తులసి మాలలు, రుద్రాక్షమాలలు స్వీకరించి మండలదీక్షను ఆరంభించారు. కృష్ణగిరి అయ్యప్పస్వామి ఆలయంలో ధర్మపురిలోని అయ్యప్పస్వామి ఆలయంలోనూ శబరిమలై వెళ్లనున్న భక్తులు గురుస్వాములసమక్షంలో వ్రతదీక్షను ప్రారంభించారు.

నగరంలో...: నగరంలోని రాజాఅన్నామలైపురంలోని అయ్యప్పస్వామి ఆలయం, కోడంబాక్కం సమీపం మహాలింగపురం అయ్యప్పస్వామి ఆలయం కూడా అయ్యప్ప వ్రతమాచరించనున్న భక్తులతో కిటకిటలాడింది.గురుస్వాముల ఆశీస్సులతో తులసిమాలలు ధరించి అయ్యప్ప వ్రతదీక్షను ప్రారంభించారు. రాజా అన్నామలైపురం ఆలయం వద్ద ఉదయం ఆరుగంటలకే అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ భక్తులు వరుసగా బారులుతీరి గురుస్వాముల చేత తులసిమాలలుధరింపజేసుకుని అయ్యప్పస్వామిని కీర్తిస్తూ నినాదాలు చేశారు.

అన్నానగర్ పార్క్ టవర్ మళ్లీ ప్రారంభం

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్ పార్క్ టవర్ ఎక్కేందుకు ప్రజలను అనుమతిస్తున్నారు. 135 అడుగుల ఈ టవర్ పైకెక్కి నగరం అందాలు వీక్షించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతుంటారు. ఈ క్రమంలో, గత నెల 27వ తేది పరీష్ భాషా (22) అనే పోలీసు టవర్ పైకెక్కి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు బెదిరించాడు. అతడిని పోలీసులు కిందకు తీసుకొచ్చారు. ఈ కారణంగా ప్రజలు టవర్ పైకి ఎక్కేందుకు చెన్నై కార్పొరేషన్ నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో, ప్రజల కోరిక మేరకు, పోలీసుల నిబంధనలతో టవర్ పైకి ప్రజలు వెళ్లేందుకు అనుమతించారు.

సమాచార దర్శిని

అయ్యప్ప భక్తులకు సమాచార కేంద్రం

పెరంబూర్,నవంబరు16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంనుంచి శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం 24 గంటలు పనిచేసే సమాచార కేంద్రాన్ని హిందూ దేవాదాయ శాఖ ప్రారంభించింది.ఈకేంద్రం జనవరి 24వ తేది వరకు పనిచేయనుంది.శబరిమల వెళ్లే భక్తులు రవాణా, బస తదితరాల కోసం 044-2833 9999, 1800 425 1757 అనే నెంబర్లు సంప్రదించవచ్చని ఆ శాఖ అధికారులు తెలిపారు.

నేడు రాష్ట్రానికి కేంద్ర ఆర్థిక సంఘం రాక

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నిధులు పంపంకాలపై కేంద్ర ఆర్థిక సంఘం ఏర్పాటైంది. ఆర్థిక శాఖ ఉన్నతాధికారుల బృందం ఐదేళ్లకు ఒకసారి అన్ని రాష్ట్రాల్లో పర్యటిస్తోంది. ఆ ప్రకారం, 16వ ఆర్థిక సంఘం అధ్యక్షుడు అరవింద్ పనగారియా నేతృత్వంలో బృందం ఆదివారం రాష్ట్రానికి రానుంది. 18వ తేది ఈ బృందం ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులతో సమావేశం కానుంది. నాలుగు రోజులు పలు ప్రాంతాల్లో పర్యటించనున్న ఈ బృందం 20వ తేది ఢిల్లీ బయల్దేరి వెళ్తుందని సచివాలయం అధికారులు తెలిపారు.

నేడు చెన్నై బీచ్-తాంబరం సబర్బన్ రైళ్ల రద్దు

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తాంబరం రైల్వే యార్డులో ఆదివారం చేపట్టనున్న పనుల కారణంగా చెన్నై బీచ్-తాంబరం మధ్య ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సబర్బన్ రైళ్లు రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. అదే సమయంలో, చెన్నై బీచ్-చెంగల్పట్టు-కాంచీపురం సబర్బన్ రైళ్లు యధావిధిగా నడుస్తాయి. అలాగే, ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై బీచ్-పల్లావరం మధ్య 45 నిమిషాలకు ఒక ప్రత్యేక సబర్బన్ రైలు నడుపనున్నారు. సాయంత్రం 5 గంటల అనంతరం ఆదివారం టైంటేబుల్ ప్రకారం సబర్బన్ రైళ్లు నడుస్తాయని దక్షిణ రైల్వే తెలిపింది.

టీఎన్‌పీఎస్సీ 'టెలిగ్రామ్ ఛానల్'

పెరంబూర్,నవంబరు16(ఆంధ్రజ్యోతి): రాతపరీక్షకు సంబంధించిన వివరాలు,ఫలితాలు తెలుసుకొనేందుకు టీఎన్‌పీఎస్సీటెలిగ్రామ్ ఛానల్ పరిచయం చేసింది. ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీ పోస్టులను తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక బోర్డు (టీఎన్‌పీఎస్సీ) పోటీ పరీక్షల ద్వారా భర్తీచేస్తోంది. పరీక్షల నోటిఫికేషన్, టైం టేబుల్, ఆన్సర్ కీ, ఫలితాలను టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్, ఎక్స్ పేజీలో విడుదల చేస్తున్నారు.ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఇక టెలిగ్రామ్ ఛానల్ ద్వారా వివరాలు అందించాలని టీఎన్‌పీఎస్సీ నిర్ణయించింది.ఈ ఛానల్‌లో చేరేందుకు క్యూ ఆర్ కోడ్ విడుదల చేశారు.

చెన్నై-తిరుచ్చి మధ్య సీఎన్జీ బస్సు

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీఎన్జీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన తొలి బస్సు సేవలు చెన్నై-తిరుచ్చి మధ్య శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. పర్యావరణ పరిరక్షణ, డీజిల్ బదులుగా సీఎన్జీ అనే కంప్రెస్డ్ నాచురల్ గ్యాస్ (సీఎన్జీ) ద్వారా బస్సులు నడపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం, ఏడు ప్రాంతీయ రవాణా సంస్థలకు 20కి పైగా సీఎన్జీతో నడిచే బస్సులు అందించాలని నిర్ణయించింది. ప్రస్తుతం తయారైన సీఎన్జీ బస్సును చెన్నై-తిరుచ్చి మధ్య గత 12వ తేది నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతం కావడంతో, శుక్రవారం నుంచి ఈ బస్సు సేవలు ప్రారంభమయ్యాయి. తదుపరి వారం మరో రెండు సీఎన్జీ బస్సులు నడుపనున్నట్లు అధికారులు తెలిపారు.

పౌష్టికాహార పథకంలో స్వల్ప మార్పులు

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహార పథకంలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారంలో స్వల్ప మార్పులు చేపట్టినట్లు సాంఘిక సంక్షేమ శాఖ ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకారం, 1, 3వ మంగళవారాల్లో అన్నం, ముడి శెనగల గ్రేవీ, టమోటా మసాల గుడ్డు అందజేయనున్నారు. అలాగే, 2,4వ మంగళవారాల్లో అన్నం, కాయగూరల సాంబార్, పెప్పర్ గుడ్డు అందజేయనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ తెలిపింది.

రిటైర్డ్ ఉద్యోగులకు నగదు ప్రయోజనాలు చెల్లించాలి

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల క్రితం పదవీవిరమణ చేసిన డ్రైవర్లకు చెల్లించాల్సిన నగదు ప్రయోజనాలను ఈ నెల 20వ తేదిలోపు అందించాలని విల్లుపురం ప్రాంతీయ రవాణా కార్యాలయ డైరెక్టర్‌కు మద్రాసు హైకోర్టు ఆదేశించింది. ఉత్తర్వులు ఉల్లంఘించిన పక్షంలో 22వ తేది స్వయంగా కోర్టుకు హాజరుకావాల్సి వస్తుందని ఉత్తర్వులో హెచ్చరించింది. పదవీ విరమణ పొందిన లక్ష్మీపతి తనకు పదవీవిరమణ ప్రయోజనాలు సత్వరం చెల్లించాలని మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు.

ఎన్నికల విధుల ప్రోత్సాహక భత్యం విడుదల

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బందికి ప్రోత్సాహక భత్యం ఇచ్చేందుకు రూ.171.89 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలో ఏప్రిల్ 19న ఒకే విడతలో పార్లమెంటు ఎన్నికల పోలింగ్ నిర్వహించగా, ఓట్ల లెక్కింపు జూన్ 4వ తేది జరిగింది. ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బందికి అందించాల్సిన ప్రోత్సాహక భత్యం ఐదు నెలలుగా ప్రభుత్వం విడుదల చేయలేదు. ఈ క్రమంలో, ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు ఎన్నికల సిబ్బందికి ప్రోత్సాహక భత్యంగా రూ.17,89,11,407 విడుదల చేసింది. ఆ ప్రకారం, పోలింగ్ అధికారులు, సిబ్బంది అని కేడర్ బట్టి రూ.5,000 నుంచి రూ.33,000 వరకు ప్రోత్సాహక భత్యం పొందనున్నారు.

ఓటరు జాబితా శిబిరం పరిశీలన



శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఓటరు జాబితా సవరణలు శనివారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 1,200 పాఠశాలల్లోని పోలింగ్ బూత్‌ల్లో ప్రారంభమైన శిబిరం ఆదివారం కూడా జరుగనుంది. పళ్లికొండలోని పునిద అన్నై థెరిస్సా ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శిబిరాన్ని కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆనైకట్టు తహసీల్దార్ వేండా, పలువురు అధికారులున్నారు. అలాగే, జిల్లాస్థాయి కల్చరల్ ఫెస్ట్‌ను పళ్లికొండ శిక్షా కేంద్రం పాఠశాలలో శనివారం కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన విద్యాధికారి మణిమొళి, విద్యాశాఖ అధికారులు దయాళన్, మహాలింగం, జగదీశ్వరన్ పిళ్లై తదితరులు పాల్గొన్నారు.

మూడోరోజు మార్టిన్ నివాసాల్లో తనిఖీలు

● రూ.8.80 కోట్లు స్వాధీనం

చెన్నై, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ లాటరీల వ్యాపారి మార్టిన్ సహా కుటుంబ సభ్యుల ఇళ్లల్లో దాడులు చేసిన ఈడీ అధికారులు రూ.8.80 కోట్ల మేర నగదు స్వాధీనం చేసుకున్నారు. దేశంలోని ప్రముఖ రాజకీయ పార్టీలకు రూ.1300 కోట్ల మేర విరాళాలిచ్చి అక్రమనగదు బట్వాడాకు పాల్పడ్డారనే ఆరోపణలపై నమోదైన కేసు విచారణలో భాగంగా ప్రముఖ లాటరీల వ్యాపారి మార్టిన్, ఆయన భార్య లీమారోస్, అల్లుడు ఆదవ్ అర్జున్‌కు చెందిన నివాసాలు కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారులు మూడో రోజు తనిఖీలు కొనసాగించారు. గురువారం ఉదయం చెన్నై, కోయంబత్తూరు నగరాల్లో సోదాలు జరిగాయి. చెన్నై పోయెస్‌గార్డెన్‌లో ఉన్న మార్టిన్ నివాసం, టీనగర్‌లోని ఆయన కార్యాలయం, కుమారుడు చార్లెస్ నివాసం, సంస్థలో ఈ తనిఖీలు కొనసాగాయి. తేనాంపేట కస్తూరిరంగన్ వీధిలోని మార్టిన్ అల్లుడు ఆదవ్ అర్జున్ నివాస గృహం, కోయంబత్తూరు తుడియలూరులో ఉన్న మార్టిన్ నివాసగృహం, కార్యాలయం, మార్టిన్ హోమియోపతి వైద్యకళాశాలలో ఈడీ అధికారులు సోదా కొనసాగించారు. మార్టిన్ లాటరీల అమ్మకాలలో మోసాలకు పాల్పడి రూ.910 కోట్ల నగదు వివిధ సంస్థల్లో పెట్టుబడులుగా పెట్టారని ఆరోపణలు వచ్చాయి. ఆ ఆరోపణలపై విచారణ జరిపిన ఈడీ ఆయనకు చెందిన రూ.450 కోట్ల స్థిరాస్తులను స్తంభింపజేసింది. గురువారం చెన్నై, కోయంబత్తూరు ప్రాంతాల్లోనే తనిఖీలు చేసిన ఈడీ అధికారులు శుక్ర, శనివారాల్లో హరియాణాలోని ఫరీదాబాద్, పంజాబ్‌లోని లూథియానా, పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కత్తా తదితర ప్రాంతాల్లో మార్టిన్ పెట్టుబడులు పెట్టినట్లుగా చెబుతున్న సంస్థలలోనూ సోదాలు జరిపారు.

రేపు రాత్రి అడయార్ మండలంలో తాగునీటి సరఫరా నిలిపివేత

ప్యారీస్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్) ఆధ్వర్యంలో చేపట్టనున్న పనుల కారణంగా అడయార్ మండలంలో ఈనెల 18వ తేది రాత్రి 7 నుంచి మరుసటిరోజు ఉదయం 5 గంటల వరకు తాత్కాలికంగా తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు ప్రకటించారు. సైదాపేట, తహసీల్దార్ ఆఫీస్ రోడ్డు, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, శ్రీనగర్ కాలని, రంగరాజపురం, ఆరోగ్యమాత నగర్, వెంకటాపురం, కోట్టూరుపురం గార్డన్, కరుణానిధి వీధి, తిరువళ్లువర్ నగర్, పొన్నియమ్మన్ ఆలయ వీధి, వెంకటరత్నం నగర్, పెరియార్ నగర్, వళ్లువర్ నగర్, కామరాజర్ వీధి, ఉరుసుకుప్పం, అరుణాచల పురం, శాస్త్రి నగర్, జీవరత్నం నగర్, పరమేశ్వరి నగర్, తిరువాన్మియూర్, బీచ్ రోడ్డు, తిరువళ్లువర్ నగర్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు ముందు జాగ్రత్త చర్యల కింద అవసరమైన తాగునీటిని నిల్వ ఉంచుకోవాలని చెన్నై మెట్రోవాటర్ బోర్డు విజ్ఞప్తి చేసింది.

రీసైక్లింగ్ కేంద్రం పరిశీలన



కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్

వేలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్త వేరుచేసే కేంద్రాన్ని శనివారం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్ పరిశీలించారు. కాట్పాడి వెస్ట్ ప్రాంతానికి చెందిన 12వ వార్డులో ప్రతిరోజు ఇంటింటా సేకరించే చెత్తను వేరుచేసే కేంద్రాన్ని డీఎంకే ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ ఆదేశాలతో డిప్యూటీ మేయర్ పరిశీలించారు. ఆయన వెంట కాట్పాడి వెస్ట్ ప్రాంత సెక్రటరీ, పార్టీ నిర్వాహకులు, కార్పొరేషన్ ఉద్యోగులున్నారు.

27న ఓపీఎస్ మద్దతుదారుల సమావేశం

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకేలో మళ్లీ చేరేందుకు అవకాశాలు సన్నగిల్లుతున్న నేపథ్యంలో, తదుపరి చర్యలపై చర్చించేందుకు పన్నీర్‌సెల్వం తరఫు జిల్లా కార్యదర్శుల సమావేశం ఈ నెల 17న జరుగనుంది. అన్నాడీఎంకే నుంచి బహిష్కరణకు గురైన పన్నీర్‌సెల్వం, తనను బహిష్కరించడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్ ప్రస్తుతం విచారణలో ఉంది. అన్నాడీఎంకే కార్యకర్తల హక్కుల పరిరక్షణ కమిటీ ప్రారంభించిన ఓపీఎస్, ఈ కమిటీకి జిల్లా కార్యదర్శులను కూడా నియమించారు. అలాగే, అన్నాడీఎంకే మళ్లీ ఒక్కటవుతోంది అంటూ ఓపీఎస్ ప్రకటించారు. కానీ శశికళ, దినకరన్, పన్నీర్‌సెల్వం తదితరులను మళ్లీ పార్టీలో చేర్చుకొనే అవకాశమే లేదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో, ఈ నెల 27వ తేది అశోకా హోటల్‌లో పన్నీర్ సెల్వం, తన మద్దతు జిల్లా కార్యదర్శులు, కార్యకర్తలతో సమావేశం కానున్నారు. సమావేశంలో తదుపరి చేపట్టాల్సిన చర్యలపై నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

వందే భారత్ ఆహారంలో బొద్దింకలు



ఇడ్లీ, సాంబారులో ఉన్న చిన్న బొద్దింకలు

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి నుంచి చెన్నై వస్తున్న వందే భారత్ రైలులో ఇచ్చిన సాంబారులో చిన్న బొద్దింకలు ఉండడం ప్రయాణికులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ రైలులో శనివారం ఉదయం ప్రయాణించిన ఓ వ్యక్తికి ఇచ్చిన సాంబారు ఇడ్లీలో మూడు చిన్న బొద్దింకలను గమనించి రైలు అధికారులను తెలిపాడు. అందుకు వారు, అవి బొద్దింకలు కావని, జీలకర్ర మసాలా అని తెలిపారు. దీంతో, దిగ్భ్రాంతి చెందిన ఆ యువకుడు బొద్దింకలున్న సాంబారు ప్యాకెట్‌ను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆహారం కోసం అదనం రూ.200 వసూలుచేస్తున్న రైల్వే శాఖ, నాణ్యమైన ఆహారం అందించడం లేదని ఈ వీడియోలో బాధితుడు వాపోయాడు.

పళ్లిపట్టు సంగమేశ్వరాలయంలో అన్నాభిషేకం



సంగమేశ్వరునికి అన్నాభిషేకం

తిరుత్తణి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో వున్న పార్వతీ సమేత సంగమేశ్వరాలయంలో శనివారం అన్నాభిషేకం జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని వేకువజామునే తెరిచి మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధన నిర్వహించారు. అనంతరం మూలవరులైన సంగమేశ్వరస్వామికి అన్నాభిషేకం చేసి భక్తులకు పంపిణీ చేశారు.

డీపీఐలో జిల్లా కార్యదర్శుల నియామకం

ప్యారీస్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): డీపీఐ పార్టీలో 234 మంది జిల్లా కార్యదర్శులను నియమించేందుకు ఆ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ తిరుమావళవన్ నిర్ణయించారు. ప్రస్తుతం ఆ పార్టీలో 144 మంది జిల్లా కార్యదర్శులుండగా, ఈ సంఖ్యకు పెంచనున్నారు. దళిత వర్గాలకు చెందిన పార్టీ నిర్వాహకులు మాత్రమే పార్టీ పదవుల్లో రాణిస్తున్నారు. ఇకపై దళితులు కానివారు, మహిళలకు పార్టీలో ప్రాధాన్యత కల్పించే దిశగా జిల్లా కార్యదర్శుల సంఖ్య పెంచేందుకు డీపీఐ అధిష్ఠానం నిర్ణయించింది.

తిరుత్తణిలో సింగపూర్ మంత్రి



మురుగన్ దర్శనానికి వెళ్తున్న షణ్ముగం బృందం

తిరుత్తణి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సింగపూర్ హోంశాఖ మంత్రి షణ్ముగం శనివారం తిరుత్తణి మురుగన్ ఆలయాన్ని సందర్శించారు. చెన్నై నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో తిరుత్తణి వచ్చిన షణ్ముగంకు ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం ఆయనకు పూలమాలలు, విభూతి ప్రసాదం అందజేశారు. షణ్ముగం పర్యటన సందర్భంగా పోలీసులు పటిష్ఠమైన భద్రత కల్పించారు.

200 సీట్లు గెలిచేది మేమే

● మాజీ మంత్రి తంగమణి

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 200 సీట్లు గెలుస్తామంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటిస్తున్నారని, ఆ సీట్లు గెలిచేది అన్నాడీఎంకేనని మాజీ మంత్రి తంగమణి తెలిపారు. మదురై జిల్లా తిరుప్పరంగుండ్రంలో పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ... అన్నాడీఎంకే ఇచ్చిన హామీలన్నీ తాము అధికారంలో ఉండగా నెరవేర్చామని, డీఎంకే ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి అమలుకాలేదని విమర్శించారు. అన్నాడీఎంకే ప్రభుత్వంలో ఎలాంటి పన్నులు పెంచలేదని, డీఎంకే ప్రభుత్వంలో అన్నిరకాల పన్నులు పెంచి ప్రజలపై ఆర్థిక భారం మోపారని అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 200 స్థానాలు కైవసం చేసుకొని మళ్లీ అన్నాడీఎంకే అధికారం చేపడుతుందని తంగమణి తెలిపారు.

అన్న వరసైన యువకుడితో కాపురం

● తల్లీ, కూతురు వాదనలతో హైకోర్టు దిగ్భ్రాంతి

చెన్నై, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టులో శుక్రవారం జరిగిన హెబియస్ కార్పస్ పిటిషన్ విచారణ సందర్భంగా తల్లీ, కూతురు మధ్య జరిగిన వాదన విన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు దిగ్భ్రాంతికి గురయ్యారు. సేలం జిల్లాకు చెందిన ఓ మహిళ తన కుమార్తె తన పెదతల్లి కూతురి కొడుకుని ప్రేమించి అతడితో పరారైందని, ఆమె జాడ కనుగొని తనకు అప్పగించాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ వేసింది. సోదరుడి వరసైన యువకుడిని ప్రేమించి పెళ్లి చేసుకున్న ఆమె కుమార్తె సెప్టెంబర్ మూడున ఇంటి నుంచి పరారైంది. యువతి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని గాలించినా ఆ జంట జాడ కనుక్కోలేకపోయారు. ఆ పరిస్థితుల్లో యువతి తల్లి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. హైకోర్టు ఆదేశం మేరకు పోలీసులు ముమ్మరంగా గాలించి తిరుప్పూరులో కాపురం చేస్తున్న జంటను శుక్రవారం ఉదయం న్యాయమూర్తులు ఎస్‌ఎం సుబ్రమణ్యం, ఎం.జ్యోతిరామన్‌తో కూడిన ధర్మాసనం ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తులు ఆ జంటను విచారించగా తామిద్దరం ప్రేమించి పెళ్లి చేసుకున్నామని తెలిపారు. సీనియర్ న్యాయవాది ఎన్.జ్యోతి వరుసకు అన్నాచెల్లెలైన ఆ జంట వివాహం చట్ట ప్రకారం చెల్లదని వాదించారు. ఆ విషయమై న్యాయమూర్తులు ఆ జంటను ప్రశ్నించగా తామిరువురమూ నాలుగు తరాలకు ముందున్న బంధుత్వం ప్రకారమే అన్నా చెల్లెవుతామని, నాలుగు తరాలకు ముందున్న బాంధవ్యాల మధ్య జరిగే పెళ్ళిని నిషేధించేలా ఏ చట్టమూ లేదని ఆ యువతి వాదించింది. అన్న వరుస యువకుడిని పెళ్ళిచేసుకున్నట్లు ఊరివారికి తెలిసే అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకుంటానని యువతి తల్లి తెలిపింది. పెద్దగా పట్టించుకోని ఆ యువతి ఆత్మహత్య చేసుకోవాలనుకుంటే చేసుకో అంటూ సమాధానం ఇచ్చింది. ఈ మాటలు విన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆ తర్వాత న్యాయమూర్తులు పిటిషనర్ కుమార్తె అక్రమ నిర్బంధంలో లేనట్లు రుజువు కావటంతో హెబియస్ కార్పస్ పిటిషన్ తోసిపుచ్చుతున్నట్లు ప్రకటించి, ఆ జంటకు ఎవరూ ఎలాంటి ఇబ్బంది కలిగించకూడదని ఆదేశించారు. చివరగా ఆ యువతీ యువకులు తమ ఇష్ట ప్రకారం కాపురం చేసుకోవచ్చునని, అయితే వారి వివాహం మాత్రం చట్ట ప్రకారం చెల్లనేరదని ప్రకటించారు.

7 శాతం రిజర్వేషన్ల కోసం ఎస్‌డీపీఐ పట్టు

అడయార్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యా, ఉపాధి అవకాశాల్లో ముస్లిం సమాజ వర్గానికి చెందిన యువతీ యువకులకు ఏడు శాతం రిజర్వేషన్లు రాష్ట్ర ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో శనివారం ఊరేగింపు జరిగింది. ఇందులో ఎస్‌డీపీఐ అధ్యక్షుడు నెల్లై నెల్లై ముబారక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏఎస్ సఫీక్ అహ్మద్, బషీర్ సుల్తాన్, అస్కర్ అలీ, రవిచంద్రన్, చెన్నై నార్త్ విభాగం కార్యదర్శి మహ్మద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఊరేగింపునకు ప్రత్యేక ఆహ్వానితుడుగా, మాజీ మంత్రి, అన్నాడీఎంకే సీనియర్ నేత డి.జయకుమార్, తమిళగ వాళ్వురిమై కట్చి అధ్యక్షుడు వేల్‌మురుగన్, మే 17 ఇయ్యక్కం కన్వీనర్ తిరుమురుగన్ గాంధీ, తమిళ్ దేశీయ విడుదలై ఇయ్యక్కం ప్రధాన కార్యదర్శి త్యాగు, మద్రాస్ హైకోర్టు సీనియర్ న్యాయవాది మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముబారక్ మాట్లాడుతూ, విద్యా ఉపాధి అవకాశాల్లో ముస్లింకు 7 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని, ఎన్నికల హామీ మేరకు కొన్నేళ్ళుగా జైలు జీవితం గడుపుతున్న జీవిత ఖైదీలను ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు.

రామేశ్వరంలో కుండపోత వర్షం

ఆలయం చుట్టూ చేరిన నీరు

అడయార్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా రామేశ్వరంలో శుక్రవారం కుండపోత వర్షం కురిసింది. దీంతో రామేశ్వరం ఆలయ రథ వీధులను వరద నీరు ముంచెత్తింది. బంగాళాఖాతంలో ఏర్పడిన బాహ్య ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలోని కోస్తాతీర జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇందులో భాగంగా, రామేశ్వరంలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. దీంతో రామేశ్వరం ప్రాంతం చిన్న దీవిని తలపించింది. జన జీవనం స్తంభించిపోయింది. రామనాథస్వామి ఆలయ రథ వీధుల్లో(నాలుగు మాడ వీధులు) భారీగా వరద నీరు చేరింది. దీంతో ఆలయానికి వచ్చిన భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కాగా, జిల్లాలో తంగచ్చిమఠంలో 21 మి.మీ, మండపంలో 18.6 మిమీ, రామేశ్వరంలో 5, రామేశ్వరం దీవిలో 4.8 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

రాధాత్రి నేత్రాలయ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



శిబిరం ప్రారంభోత్సవంలో అతిథులు, నిర్వాహకులు

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాధాత్రి నేత్రాలయ డయాబెటిక్ రెటినోపతి ప్రాజెక్ట్, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నెల రోజుల ఉచిత వైద్యశిబిరం ప్రారంభమైంది. వరల్డ్ డయాబెటిక్ డే సందర్భంగా నిర్వహించనున్న ఈ వైద్యశిబిరాన్ని ఓమందూర్ మెడికల్ కాలేజ్ డీన్ ప్రొఫెసర్ డా.మణి, రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై టవర్స్ యూనివర్సల్ సీఈఓ రొటేరియన్ కేవీ సుందరం ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా రాధాత్రి నేత్రాలయ మెడికల్ డైరెక్టర్ డా.వాసుమతి వేదాంతం, మెడికల్ డైరెక్టర్ డా.ప్రవీణ్‌కృష్ణ మాట్లాడుతూ... ఐదేళ్లుగా మధుమేహంతో బాధపడుతున్న వారు ఏడాదికి ఒకసారైనా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఏఐ టెక్నాలజీతో డయాబెటిక్ రెటినోపతి అధునాతన పరీక్షా విధానాలను చూపారు. నగరంలోని రద్దీ ప్రాంతాలు, అర్బన్ స్లమ్స్ తదితర ప్రాంతాల్లో ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నామని, మధుమేహ వ్యాధిగ్రస్తులు 044-24332229, 9445438681 అనే నెంబర్లు సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.



చెన్నై కార్పొరేషన్ కార్యాలయంలో ఉత్తర చెన్నై అభివృద్ధి పథకంలో భాగంగా వాల్‌టాక్స్‌రోడ్డు ప్రాంతంలో నిర్మించనున్న గృహసముదాయాల శంకుస్థాపన ముందస్తు ఏర్పాట్లు గురించి అధికారులతో చర్చలు జరుపుతున్న సీఎండీఏ ఇన్‌ఛార్జి మంత్రి పీకే శేఖర్‌బాబు

అత్త అంత్యక్రియల్లో కోడలి మృతి

అడయార్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అత్త అంత్యక్రియల్లో జరిగిన అగ్నిప్రమాదం కారణంగా కోడలు మరణించింది. ఈ విషాదకర ఘటన కోయంబత్తూరు జిల్లా కేంద్రంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కోవై గణపతి నగర్ మూడో వీధికి చెందిన రామలక్ష్మి (85) శుక్రవారం మృతి చెందగా, మృతదేహాన్ని ఫ్రీజర్ బాక్సులో ఉంచారు. అర్ధరాత్రి సమయంలో కొంతభాగం కరెంట్ పోయింది. దీంతో జనరేటర్ సాయంతో ఫ్రీజర్ బాక్సుకు విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రయత్నించారు. ఇందుకోసం జనరేటర్‌లో డీజిల్ వేస్తుండగా, ఒక్కసారిగా మంటలు చెలరేగి నలువైపులా వ్యాపించాయి. ఈ మంటల్లో చిక్కుకున్న రామలక్ష్మి కోడలు పద్మావతి (53)సహా మరోముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా పద్మావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మరణించింది. పద్మావతి ఒక ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. దీంతో ఆ ఇంటిలో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మహాబలిపురం బీచ్‌లో ఇద్దరు యువకుల గల్లంతు

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహాబలిపురం సముద్ర తీరంలో స్నానాలకు వెళ్లి గల్లంతైన ఇద్దరు యువకుల కోసం కోస్ట్‌గార్డ్ సిబ్బంది తీవ్రంగా గాలిస్తున్నారు. స్థానిక అన్నానగర్‌కు చెందిన గిరీష్ (20), రియాజ్ (18) తన స్నేహితులతో కలసి మహాబలిపురం విహార యాత్రకు వెళ్లారు. స్నేహితులందూ సముద్రంలో స్నానాలు చేస్తున్న సమయంలో, హఠాత్తుగా వచ్చిన భారీ అలకు గిరీష్, రియాజ్ గల్లంతయ్యారు. స్నేహితుల సమాచారంతో అగ్నిమాపక, కోస్ట్‌గార్డ్ సిబ్బంది, జాలర్లు గల్లంతైన ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

ఎలుకల మందుతో పిల్లల మృతి వ్యవహారం....

పెస్ట్ కంట్రోల్ కంపెనీ లైసెన్స్ రద్దు

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగర సమీపంలోని ఇంట్లో ఎలుకల మందు పీల్చడంతో ఇద్దరు పిల్లలు మృతిచెందిన వ్యవహారంలో పెస్ట్ కంట్రోల్ కంపెనీ లైసెన్స్ రద్దు చేశారు. ఓ పెస్ట్ కంట్రోల్ సంస్థ లైసెన్స్ రద్దు చేసిన వ్యవసాయ శాఖ అధికారులు, ఆ సంస్థపై చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. కుండ్రత్తూర్‌లోని ఓ బ్యాంక్ మేనేజర్ ఇంట్లో ఎలుకల బెడద ఎక్కువకావడంతో ఈ నెల 14వ తేది ఎలుకల మందు ఉంచారు. మోతాదుకు మించి ఎలుకల మందు ఉంచడంతో, గదిలోని ఏసీ నుంచి వచ్చిన గాలులకు ఎలుకల మందు తోడై ఇద్దరు చిన్నారులు శ్వాసతీసుకోలేక మృతిచెందారు. ఈ వ్యవహారంలో 'యునిక్యూ' పెస్ట్ కంట్రోల్ సంస్థకు చెందిన ఇద్దరు ఉద్యోగులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంలో సంస్థ లైసెన్స్ రద్దు చేసిన అధికారులు, సంస్థ కార్యాలయానికి సీలు వేయాలని నిర్ణయించారు.

చోరీకి గురైన నగలు, నగదు స్వాధీనం

వేలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొట్టాయిలో గత వారం మణిమారన్ ఇంట్లో చొరబడిన ఆగంతకులు, బీరువాలోని నగలు, నగదు దోచుకొని పరారయ్యారు. ఈ వ్యవహారంపై జిల్లా ఎస్పీ మదివానన్ ఉత్తర్వులతో ఆనైకట్టు సీఐ సారథి, పళ్లికొండ ఎస్ఐ సిలంబరసన్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం, ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ పరిశీలించారు. ఈ ఫుటేజీ ఆధారంగా చెందిన కృష్ణగిరి జిల్లా కావేరి పట్టణానికి చెందిన రాజ్‌కుమార్‌కు అరెస్ట్ చేసి, అతని నుంచి 39 సవర్ల నగలు, నగదు స్వాధీనం చేసుకొని, కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

టాస్మాక్ బార్లలో మద్యం స్వాధీనం

ప్యారీస్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరం నియోజకవర్గంలో రాత్రి 10 గంటలకు పైగా పనిచేసిన టాస్మాక్ బార్ల నుంచి 140 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం టాస్మాక్ మద్యం విక్రయాలకు అనుమతించిన సమయం కంటే రాత్రి వేళల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారం అందింది. దీంతో తాంబరం పోలీస్ కమిషనర్ అబిన్ దినేష్ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన పోలీసులు, 5 బార్ల నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేశారు.

వీపులో దిగబడిన కత్తి

● మదనపల్లెవాసికి జీహెచ్‌లో శస్త్రచికిత్స

చెన్నై, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన వీరాసామి (44) అనే కార్మికుడి వీపులో 15 సెం.మీ.మేర దిగబడిన కత్తిని నగరంలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆస్పత్రి (జీహెచ్)లో వైద్యులు మూడు గంటలపాటు శస్త్రచికిత్స చేసి తొలగించారు. మూడు రోజుల క్రితం బంధువులతో జరిగిన ఘర్షణల్లో వీరాసామి కత్తిపోటుకు గురయ్యారు. వీపులో 15. సెం.మీ. లోతులో కత్తి దిగబడటంతో అక్కడి ఆస్పత్రుల్లో చికిత్స పొందేందుకు ప్రయత్నించారు. ఎక్కడా అతడికి శస్త్రచికిత్స చేసి కత్తిని తొలగించేందుకు వైద్యులు సాహసించలేకపోయారు. చివరకు చెన్నై ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీహెచ్)లో చికిత్సకోసం చేరాడు. వైద్యులు అన్ని పరీక్షలు చేసి మూడు గంటలపాటు శస్త్రచికిత్స జరిపి ఆ కత్తిని తొలగించారు. శనివారం ఈ విషయమై ఆ ఆస్పత్రి డీన్ థెరని రాజన్ మాట్లాడుతూ.. వీరాసామి వీపులో కత్తి దిగబడటం వల్ల అతడిని పడుకోబెట్టి ఆపరేషన్ చేయలేక కూర్చోబెట్టి అనస్తీషియా ఇచ్చి ఆపరేషన్ చేశామన్నారు. డాక్టర్ మారియప్పన్ నాయకత్వంలో ప్రొఫెసర్ డాక్టర్ శివన్‌రాజ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జయప్రకాష్‌తో కూడిన వైద్య బృందం ఈ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించిందని, ప్రస్తుతం వీరాసామి పూర్తిగా కోలుకుని విశ్రాంతి తీసుకుంటున్నాడని ఆయన వివరించారు.

విజయవంతంగా ఫేషియల్ నర్వ్ సర్జికల్ వర్క్‌షాపు



వర్క్‌షాపులో వైద్యనిపుణులు

అడయార్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో తొలిసారి ఫేషియల్ నర్వ్ సర్జికల్ వర్క్‌షాపు విజయవంతంగా జరిగింది. చెన్నైలోని ది హెడ్ అండ్ నెక్ సెంటర్ అండ్ హాస్పిటల్ (టీహెచ్‌ఏఎన్‌సీ) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన ఈ వర్క్‌షాపులో దేశ వ్యాప్తంగా ఉన్న ప్లాస్టిక్ సర్జన్లు, మాక్సిలో ఫేసియల్ సర్జన్లు, ఈఎన్‌టీ, హెడ్ అండ్ నెక్ సర్జన్స్ పాల్గొన్నారు. ఇందులో దేశ విదేశాలకు చెందిన సర్జన్లు పాల్గొని వివిధ అంశాలపై విశ్లేషించారు. అలాగే, సర్జికల్ వీడియోలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా టీహెచ్‌ఏఎన్‌సీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.విద్యాధరన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఈ తరహా వర్క్‌షాపు నిర్వహించడం ఇదే తొలిసారన్నారు. వివిధ విభాగాల్లో నిష్ణాతులైన వైద్యులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారని తెలిపారు.

రహదారిపై 'స్కార్పియో' దగ్ధం

డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులకు తప్పిన ప్రమాదం

పలమనేరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం ఓ స్కార్పియో వాహనం దగ్ధమైంది. డ్రైవర్ అప్రమత్తతతో వాహనంలోని ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. కర్ణాటక రాష్ట్రం ముళబాగల్‌కు చెందిన ఏడుగురు ఓ స్కార్పియో వాహనంలో తమిళనాడులోని తిరువణ్ణామలై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో పలమనేరు సమీపంలోకి రాగానే వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి.. అందులోని వారందరినీ దింపేసి, దూరంగా వెళ్లిపోయారు. స్థానికులు తగలబడుతున్న వాహనాన్ని చూసి.. పలమనేరు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్‌స్టేషన్ సిబ్బంది ప్రమాద స్థలానికి వచ్చి మంటలను ఆర్పారు. సుమారు రూ.2లక్షలు ఆస్తినష్టం జరిగి ఉండవచ్చని ఫైర్‌స్టేషన్ సిబ్బంది తెలిపారు.

16 భాషల్లో విమల్ చిత్రం 'బెల్లడోనా'

విమల్ హీరోగా నటించే 35వ చిత్రానికి 'బెల్లడోనా' అనే టైటిల్ ఖరారు చేశారు. యుఫోరియా ఫ్లిక్స్ పతాకం నిర్మించే ఈ చిత్రానికి సంతోష్ బాబు ముత్తుస్వామి దర్శకుడు. తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ, మణిపురి సహా మొత్తం 16 భాషల్లో తెరకెక్కించనున్నారు. వైవిధ్యభరితమైన పాత్రలను ఎంచుకుంటూ తమిళ చిత్రపరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నారు. తాజాగా 'సర్' పేరుతో ప్రేక్షకుల ముందుకు వచ్చి ఆలరించారు. ఇపుడు తన 35వ సినిమాలో నటిస్తున్నారు. తేజస్విని శర్మ, మణిపూర్‌కు చెందిన మాక్సినా పనోమ్ అనే ఇద్దరు హీరోయిన్లు నటిస్తున్నారు. పూర్తి కొత్తదనంతో కూడిన రిఫ్రెష్ సినిమాగా ఉంటుందని దర్శక నిర్మాతలు ప్రకటించారు. ఈ సినిమా వివరాలను దర్శకుడు సంతోష్ బాబు వివరిస్తూ, "బెల్లడోనా' సినిమా ప్రేక్షకులకు సరికొత్త, ప్రత్యేకమైన అనుభూతి అందిస్తుంది. ఇది భారీ బడ్జెట్ ప్రాజెక్టు. ప్రతి ఫ్రేమ్ అద్భుతంగా ఉండేలా ప్లాన్ చేస్తున్నాం. కథకు తగిన విధంగా నటీనటులను ఎంపిక చేశాం. విమల్ కెరీర్‌లో ఈ సూపర్ నేచురల్ హార్రర్ మూవీ ఒక ప్రధాన మైలురాయిగా నిలుస్తుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన మరికొన్ని ఆసక్తికర అంశాలు త్వరలోనే వెల్లడిస్తాం' అని పేర్కొన్నారు.

చిత్రజ్యోతి



'బెల్లడోనా' విమల్, తేజస్విని శర్మ, మాక్సినా పనోమ్

ఆ చిత్రం నా కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ : రెహమాన్

గతంలో కార్తీక్ నరేన్ దర్శకత్వంలో వచ్చిన 'ధృవంగల్ పదినారు' చిత్రంతో తన కెరీర్ పూర్తిగా మారిపోయిందని, ఇపుడు 'నిరంగల్ మూండ్రు' విడుదల తర్వాత అలాంటి మార్పు వస్తుందన్న నమ్మకం ఉందని సీనియర్ నటుడు రెహమాన్ అన్నారు. అధర్వ మురళి, శరత్ కుమార్, రెహమాన్, అమ్ము అభిరామి తదితరులు నటించిన 'నిరంగల్ మూండ్రు' ఈ నెల 22వ తేదీన విడుదల కానుంది. దీన్ని పురస్కరించుకుని చిత్ర బృందం ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ, 'ఈ యేడాది నాకు ఎంతో స్పెషల్. నేను నటించిన 5 చిత్రాలు విడుదలయ్యాయి. ఇది డిఫరెంట్ మూవీ. ఇందులో నటించినందుకు సంతోషంగా ఉంది. ఖచ్చితంగా నా కెరీర్‌లో మరో మార్పు ఖాయం' అన్నారు. దర్శకుడు కార్తీక్ నరేన్ మాట్లాడుతూ, 'ఈ సినిమా నాకు ప్రత్యేకం.చాలా యేళ్ళ తర్వాత నా చిత్రం విడుదలవుతుంది. ఈ స్టోరీ ప్రేక్షకులకు భిన్నంగా ఉంటుంది' అన్నారు. నటి అమ్ము అభిరామి మాట్లాడుతూ, 'నేను ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న మూవీ. భిన్నమైన పాత్ర ఎంచుకున్నందుకు ధన్యవాదాలు. థియేటర్లలో తప్పక చూడండి' అని కోరారు. హీరో అధర్వ మురళి మాట్లాడుతూ, 'ధృవంగల్ పదినారు' మూవీ చూసినప్పటి నుంచి కార్తీక్ నరేన్‌తో కలిసి పనిచేయాలనుకున్నాను. ఒక సీన్ చిత్రీకరణకు ఆయన వ్యవహారశైలి భిన్నంగా ఉంటుంది. ఒక వైపు భయం, మరోవైపు సంతోషంతో ఈ సినిమా అంగీకరించాను. శరత్‌కుమార్, రెహమాన్, అమ్ము వంటి ప్రధాన నటీనటులతో కలిసి పనిచేయడం గర్వంగా ఉంది.నిర్మాత, దర్శకులకు కృతజ్ఞతలు. 22న ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం.మీడియాతో పాటు ప్రేక్షకులు ఆదరించాలని కోరుతున్నాం' అని పేర్కొన్నారు.



'నిరంగల్ మూండ్రు' ప్రీరిలీజ్ ఈవెంట్ దృశ్యం

దర్శకుడు సురేష్ సంగయ్య మృతి

● కోలీవుడ్‌లో విషాదం

'ఒరు కిడాయిన్ కరుణై మను', సత్తియ శోధనై' వంటి హిట్ చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు సురేష్ సంగయ్య (41) అనారోగ్యంతో కన్నుమూశారు. గత కొంతకాలంగా కాలేయ సమస్యలతో బాధపడుతున్న ఆయనకు.. ఇటీవల కామెర్లు వచ్చాయి. దీంతో నగరంలోని రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆయన శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య ఓ కుమార్తె ఉన్నారు. విరుదునగర్ జిల్లా రాజపాళెయం సమీపంలోని కరిసల్‌కుళంకు చెందిన సురేష్ సంగయ్య చిత్రపరిశ్రమలోకి చాలా సంవత్సరాల క్రితం అడుగు పెట్టినప్పటికీ ఆయన దర్శకత్వం వహించిన 'ఒరు కిడాయిన్ కరుణై మను' చిత్రం 2017లో విడుదలైంది. నూతన దంపతులు తమ మొక్కులు చెల్లించడానికి మేకను బలి ఇచ్చేందుకు ఆలయానికి వెళతారు. అక్కడ వారికి ఎలాంటి అనుభవం ఎదురైంది? అన్నదే ఈ చిత్ర కథ. విమర్శనాత్మకంగా ఈ చిత్రం ప్రతి ఒక్కరి దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత 2023లో 'సత్తియ శోధనై' పేరుతో మరో చిత్రాన్ని రూపొందించారు. ఒక హత్య చుట్టూ తిరిగే బ్లాక్ కామెడీ శైలిలో తెరకెక్కించగా, ప్రేక్షకాదారణ పొందింది. కాగా, సురేష్ సంగయ్య మృతిపట్ల తమిళ సినీ దర్శకుల సంఘంతో పాటు నడిగర్ సంఘం నిర్వాహకులు, సినీ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని వ్యక్తం చేశారు.



సురేష్ సంగయ్య (ఫైల్‌ఫొటో)

రజనీ బర్త్‌డే స్పెషల్ ....

దళపతి రీ రిలీజ్



'దళపతి'లో మమ్ముట్టి - రజనీకాంత్

సూపర్‌స్టార్ రజనీకాంత్ పుట్టిన రోజు సందర్భంగా డిసెంబరు 12వ తేదీ ఆయన నటించిన సూపర్ హిట్ చిత్రాల్లో ఒకటైన 'దళపతి' రీ రిలీజ్ చేయనున్నారు. మణిరత్నం దర్శకత్వంలో మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి, రజనీకాంత్ నటించిన ఈ చిత్రం 1991లో వచ్చింది. శోభన, అరవింద్ స్వామి, శ్రీవిద్య తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఘన విజయం సాధించిన ఈ చిత్రం విడుదలై 33 యేళ్ళు పూర్తయ్యాయి. దీంతో పాటు వచ్చే నెల 12వ తేదీన రజనీ బర్త్‌డే స్పెషల్‌గా రీ రిలీజ్ చేస్తున్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఎస్ఎస్ఐ ప్రొడక్షన్ రీ రిలీజ్ హక్కులను సొంతం చేసుకుంది. అలాగే, రజనీకాంత్ నటిస్తున్న 'కూలీ' మూవీకి సంబంధించి స్పెషల్ వీడియో కూడా రిలీజ్ చేసేలా దర్శక నిర్మాతలు ప్లాన్ చేశారు. ఇదిలావుంటే, వరుస హిట్‌లు సాధిస్తున్న రజనీకాంత్ ఇపుడు 'కూలీ' మూవీలో నటిస్తున్నారు. ఆ తర్వాత 'జైలర్-2'లో నటించనున్నారు.





ఇంద్రజాలికుడు సుభాష్

● కనికట్టు విద్యను కాపాడుకోగలమా? ● కనుమరుగవుతున్న ఇంద్రజాల ప్రదర్శన

ప్రాచీన కాలంలో ప్రజలకు నాటకాలు, సంగీత కచేరీలు వినోదాన్ని పంచిపెడుతుండేవి. ఇవన్నీ ప్రేక్షకుల ముందున్న వేదికలపై ప్రదర్శితమయ్యేవి. ఆ కోవలోనే వేదికపై ప్రేక్షకులను మైమరపించి, అచ్చెరువొందేలా ఆవిష్కృతమైనదే ఇంద్రజాల ప్రదర్శన. మూడు దశాబ్దాల క్రితం ఇంద్రజాలానికి ప్రజలంతా జేజేలు పలుకుతుండేవారు. రాష్ట్రంలో ఎంతో మంది ఇంద్రజాల ప్రదర్శనలను నిర్వహించేవారు. నగరంలోని పాత కలైవానర్ అరంగంలో పీసీ సర్కార్, పీసీ సర్కార్ జూనియర్ వంటి మేటి ఇంద్రజాలికులు ఎన్నో ప్రదర్శనలతో నగరవాసులను అబ్బురపరిచేలా చేశారు. స్టేజ్ పైనున్న కళాకారులు ఏమార్చటం, స్టేజ్ దిగువనున్న ప్రేక్షకులు ఏమారటం ఈ మ్యాజిక్ షోలోని ప్రత్యేకత! ఈ ఇంద్రజాలం గురించిన ప్రస్తావన మన ప్రాచీన వేదాలు, ఉపనిషత్తుల్లోనూ వుంది. ఈ కనికట్టు విద్యను నేర్చుకోవడం ఏమంత సులభం కాదు. ఏ ఇంద్రజాలమైనా ఓ పద్ధతి ప్రకారం చేస్తేనే రాణిస్తుంది, ప్రేక్షకుల మన్ననలందుకుంటుంది. లేకుంటే అభాసుపాలవుతుంది. రాష్ట్రంలో అంతరించి పోవటానికి సిద్ధంగా ఉన్న ఈ జీవకళను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- ఆంధ్రజ్యోతి, చెన్నై





ఆదుకోండి ప్లీజ్!

కోయంబత్తూరు కురింజి ప్రాంతానికి చెందిన మ్యాజిక్ షో వ్యాఖ్యాత పళనివేల్ రాజన్ మాట్లాడుతూ.. "పిల్లల నుండి పెద్దల వరకు ఆనందింపజేసే కళల్లో ఇంద్రజాలానికి ప్రత్యేక స్థానం ఉంది. పూర్వం రాత్రంతా మ్యాజిక్ షో జరిగినా ఇంద్రజాల కళాకారులకు, ప్రేక్షకులకు ఎలాంటి అలసట ఉండేది కాదు. ఇంద్రజాలాన్ని చూసి మెచ్చుకుని ప్రేక్షకులు గట్టిగా చప్పట్లు కొడుతుంటే తమలో రెట్టింపు ఉత్సాహం కలిగేది" అని పేర్కొన్నారు. మెజీషియన్ సుభాష్ మాట్లాడుతూ.. 'నేను చదువుతున్న పాఠశాలలో ఇంద్రజాల కళాకారుడికి లభించిన సత్కారాలను చూసి ఇంద్రజాలంపై ఆసక్తి ఏర్పడింది. బీఏ చదివిన తర్వాత మ్యాజిక్‌లో శిక్షణ పొందాను. ఆ తర్వాత ప్రముఖ మెజీషియన్ల దగ్గర స్నేహితుల సహాయంతో పూర్తిగా నేర్చుకున్నాను. 25 యేళ్లుగా ఇంద్రజాల ప్రదర్శనలు ఇస్తున్నాను. మ్యాజిక్ కళలో బాడీ లాంగ్వేజీ, వేగం, సమయం, నిర్భయం అత్యంత అవసరమైనవి. వీటిలో ఏది కొరవడినా మ్యాజిక్ షో కాస్తా కామెడీ షోగా మారి అభాసుపాలవుతుంది. ఆలయ ఉత్సవాలు, వివాహాలు, పాఠశాలలు, కళాశాలల వార్షికోత్సవాల సందర్భంగా ప్రస్తుతం మ్యాజిక్ షోలు జరుపుతున్నాను. పువ్వులు, బెలూన్లు, అగ్గి, టేబుల్, పేపర్, నీళ్లు, కార్డులు, స్పూన్, బంతులు తదితర వస్తువులతో మ్యాజిక్ చేస్తున్నాను' అని వివరించారు. ఖాళీ డబ్బా నుంచి నాణేలు రప్పించడం, ఖాళీగా ఉన్న పంజరం నుండి పావురాన్ని లేదా కుందేలుని రప్పించటం.. ఓ వ్యక్తి తలను మాయం చేసి, మళ్ళీ రప్పించడం, మనిషిని గాలిలో తేలియాడేలా చేయడం, పెట్టెలోకి వెళ్లే మనిషిని మాయం చేయడం వంటి ప్రదర్శనలతో చిన్నారుల నుండి వృద్ధుల వరకూ ఆకట్టుకోగలుగుతుతున్నట్లు సుభాష్ తెలిపారు.

దుస్థితిలో కళాకారులు...

గడిచిన మూడు దశాబ్దాలుగా శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం పెరగడం, దానికి కృత్రిమ మేధోపరిజ్ఞానం తోడు కావటంతో ఇంద్రజాలం కనుమరుగయ్యే స్థితిలో ఉందని పళనివేల్ రాజన్, సుభాష్ వాపోయారు. టీవీలు, మొబైల్‌ఫోన్లు, థియేటర్లు వంటివాటితో సాంకేతికపరిజ్ఞానం వేగంగా దూసుకుపోతోంది. నాటకాలు, సంగీత కార్యక్రమాలు టీవీ ఛానెళ్లలో ఆశ్రయం పొందాయి. టీవీ ఛానెళ్లలో ప్రసారమయ్యే సినిమాల్లో గ్రాఫిక్స్ ఉపయోగించి మ్యాజిక్ చేసే కళాకారులను ఇంటినుంచే ప్రజలు తిలకించే స్థాయికి చేరుకున్నారు. దీంతో నిజమైన మ్యాజిక్ కళాకారులకు అవకాశాలు తగ్గిపోయాయి. అంతే కాకుండా పుట్టగొడుల్లా పుట్టుకొస్తున్న యూట్యూబర్లు మ్యాజిక్ ప్రదర్శనలో చిట్కాలు, తంత్రాలను బట్టబయలు చేయడమే పనిగా పెట్టుకున్నారని, దీంతో ఇంద్రజాల కళాకారులు, నిపుణులకు ఆదరణ బాగా తగ్గిందని రాజన్, సుభాష్ పేర్కొన్నారు. మ్యాజిక్‌ను ఊపిరిగా భావిస్తున్న కళాకారులంతా మరో వృత్తిలోకి ప్రవేశించలేక దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు.

మ్యాజిక్ అకాడమీ అవసరం..

ప్రస్తుతం రాష్ట్రంలో వంశపారంపర్యంగా మ్యాజిక్ చేసిన కళాకారులంతా వేరే వృత్తులలోకి మారిపోయారు. మ్యాజిక్‌ను తమ ప్రాణంగా భావించే కళాకారులు ఇంకా తమ కనికట్టు విద్యకు మంచి రోజులు రాకపోతాయా అని ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలు, ఎగ్జిబిషన్లు, రాజకీయ నేతల జయంతి ఉత్సవాల్లో ఇంద్రజాల ప్రదర్శనలను అనుమతించాలని కళాకారులు కోరుతున్నారు. స్టార్‌హోటళ్లు, రెస్టారెంట్లలో మ్యాజిక్ షోలు నిర్వహించేందుకు అనుమతిస్తే కళాకారులకు ఊపిరిపోసినట్లవుతుందని వారు వ్యాఖ్యానిస్తున్నారు. మ్యాజిక్‌ను నేర్చుకోవాలని ఆసక్తికనబరుస్తున్న యువకులకు ఆ కళపై శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర స్థాయిలో మ్యాజిక్ అకాడమీ ఏర్పాటు చేయాలని కళాకారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కిక్కిరిసిన తిరువణ్ణామలై

గిరిప్రదక్షిణ చేసిన లక్షలాది మంది భక్తులు

ప్యారీస్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలో కార్తీక మాస ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు అరుణాచలేశ్వర స్వామి కొండ చుట్టూ ఉన్న 14 కి.మీ గిరిప్రదక్షిణ మార్గం లక్షలాది మంది భక్తులతో కిటకిటలాడింది. ఉన్నామలై సమేత అన్నామలైయార్ స్వామివారి దర్శనం కోసం శుక్రవారం ఉదయం నుంచే రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తిరువణ్ణామలై చేరుకున్నారు. ఉదయం 5.45 గంటలకు ప్రారంభమైన పౌర్ణమి పూజల్లో, గిరిప్రదక్షిణలో దాదాపు 15 లక్షల మందికి పైగా భక్తులు పాల్గొన్నట్లు సమాచారం. ఆలయ అధికారులు కనీస వసతులు కల్పించలేదని భక్తులు ఆరోపించారు. పలు ప్రాంతాల నుంచి వెళ్లే భక్తుల వాహనాల పార్కింగ్ స్థలం కేటాయించలేదని, ఎండలో సేదతీరేందుకు పైకప్పు కూడా ఏర్పాటుచేయలేదని భక్తులు వాపోయారు. కాగా, లక్షలాది మంది భక్తుల రద్దీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సుమారు వెయ్యి మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

'అమరన్' ప్రదర్శిస్తున్న థియేటర్‌పై బాంబు దాడి

● తిరునల్వేలి హిందూ మున్నాని నిరసన ప్రదర్శన



బాంబుదాడి జరిగిన అలంకార్ థియేటర్

చెన్నై, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలిలోని అలంకార్ సినిమా థియేటర్‌పై గుర్తు తెలియని ఇద్దరు దుండగులు పెట్రోలు బాంబులతో దాడి జరిపారు. యువనటుడు శివకార్తికేయన్, నటి సాయిపల్లవి జంటగా నటించిన 'అమరన్' చిత్రంలో ముస్లింలను కించపరిచే సన్నివేశాలున్నాయని ఆరోపిస్తూ ఇటీవల ఎస్డీపీఐ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరిపారు. ఈ నేపథ్యంలో తిరునల్వేలిలో అమరన్ చిత్రం ప్రదర్శిస్తున్న అలంకార్ థియేటర్‌పై శనివారం వేకువజామున గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు పెట్రోలు బాంబులు విసిరి పారిపోయారు. విషయం తెలియగానే పోలీసులు ఆ థియేటర్ వద్దకు వెళ్ళి దర్యాప్తు జరిపారు. అదే సమయంలో థియేటర్‌పై బాంబు దాడిని ఖండిస్తూ హిందూ మున్నాని ఉపాధ్యక్షుడు జయకుమార్ నాయకత్వంలో సుమారు వంద మంది కార్యకర్తలు ధర్నా చేసేందుకు ప్రయత్నించారు. పోలీసులు దానిని అడ్డుకుని హిందూ మున్నాని నేత జయకుమార్, కార్యకర్తలను అరెస్టు చేశారు.



హిందూమున్నాని కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

టీవీకేలో 120 మంది జిల్లా కార్యదర్శులు

● ముమ్మరంగా ఎంపిక ప్రక్రియ



ప్యారీస్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) బలోపేతానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 120 మంది జిల్లా కార్యదర్శులను నియమించేందుకు ఆ పార్టీ అధిష్టానం చర్యలు ప్రారంభించింది. విల్లుపురం జిల్లా విక్రవాండిలో టీవీకే తొలి మహానాడు విజయవంతం కావడంతో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లో చేపడుతున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా బుస్సీ ఆనంద్‌ను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు విజయ్ ప్రకటించారు. మరి కొంతమంది రాష్ట్రస్థాయి నిర్వాహకులను కూడా మహానాడు ముందు నియమించారు. జిల్లాస్థాయిలో నిర్వాహకులను ఇప్పటివరకు నియమించలేదు. ఇదిలా ఉండగా, 2026లో రాష్ట్ర అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లో టీవీకే తరపున ఆయా నియోజకవర్గాల్లో గెలుపు అవకాశాలున్న వారి వివరాలను సేకరించేందుకు అధిష్టానం నిర్ణయించింది. విజయ్ పార్టీలో 60 శాతం మందికి పైగా ఆయన అభిమానులు సభ్యులుగా ఉన్నారు. పార్టీకి జిల్లా కార్యదర్శులు వెన్నెముకలాంటి వారు కావడంతో డీఎంకే, అన్నాడీఎంకే తదితర పార్టీల్లో లాగే టీవీకేలో కూడా జిల్లా కార్యదర్శులను నియమించాలని విజయ్ భావిస్తున్నారు. పార్టీ తరఫున 120 జిల్లా విభాగాలను రూపొందించనున్నారు. వీటికి తొలివిడతగా జిల్లా కార్యదర్శులను ఎంపిక చేస్తారు. ఇందుకోసం విజయ్ అభిమాన సంఘంగా ఉన్నప్పటి నుంచి ప్రతిఫలం ఆశించకుండా సమాజసేవలో పాల్గొంటున్నవారు, పార్టీ ప్రారంభించినప్పటి నుంచి పార్టీ అభివృద్ధి కోసం కృషిచేస్తున్న వారి పేర్లను ఎంపిక చేసి త్వరలోనే వారిని ఇంటర్వ్యూ కూడా చేయనున్నట్లు తెలిసింది. డిసెంబరు మొదటి వారంనాటికి జిల్లా కార్యదర్శుల ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే అవకాశముందని టీవీకే నిర్వాహకులు తెలిపారు.

మీ భర్త అలా చేయడం ధర్మమా?

● నయనతారకు దర్శకుడు కౌంటర్



దర్శకుడు ఎస్ఎస్ కుమరన్, నయనతార

అడయార్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హీరో ధనుష్‌పై ఘాటు వ్యాఖ్యలు చేసిన హీరోయిన్ నయనతారకు కోలీవుడ్ దర్శకుడు ఎస్ఎస్ కుమరన్ కౌంటర్ ఇచ్చారు. ఎన్‌వోసీ ఇవ్వనందుకు ధనుష్‌పై విమర్శలు చేసే ముందు మీ భర్త, సినీ దర్శకుడు విఘ్నేష్ శివన్ తనకు కలిగించిన మానసిక క్షోభపై స్పందించాలని, మీ భర్త అలా చేయగం ధర్మమా? మీ భర్త చేసిన పనిని పైనుంచి దేవుడు చూస్తున్నాడని దర్శకుడు కుమరన్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన శనివారం ప్రకటన విడుదల చేశారు. తమ సినిమా కథకు సారూప్యత ఉన్న 'ఎల్ఐసి' అనే టైటిల్ రిజిస్టర్ చేయించుకుంటే, మీ భర్త విఘ్నేష్ శివన్ అదే టైటిల్‌తో సినిమా ప్రకటించి, ప్రచారం చేయడం ఎంతమేరకు సబబని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికి కూడా 'ఎల్ఐసీ' పేరుతోనే ఆయన సినిమా తీస్తున్నారని, ఇది తమను ఎంతగానో బాధించిందన్నారు. మీలాంటి పెద్దవారే ఎన్‌వోసీ తీసుకునేందుకు రెండేళ్ళుగా పోరాటం చేశారంటే తమ లాంటి చిన్నవారి పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. పైగా ఈ టైటిల్ అంశంపై విఘ్నేష్‌ను సంప్రదిస్తే ధిక్కార స్వరంతో 'మీవల్ల ఏం చేయగలరు' అంటూ వ్యాఖ్యానించారని, దీనికి నయనతార ఉన్నతస్థితే కారణమై ఉండవచ్చన్నారు. దీనికి ఏ దేవుడి కోర్టులో విఘ్నేష్ శివన్ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

వినయ, విధేయతలే విద్యార్థి విజయానికి సోపానం

● డాక్టర్ సతీష్



బహుమతులు అందుకున్న విద్యార్థులతో డా.సతీష్, ఎస్ఎల్ సుదర్శనం తదితరులు

ప్యారీస్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వినయ, విధేయతలు కలిగిన విద్యార్థులు జీవితంలో మంచి విజయాలు సాధిస్తారని ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు సి.సతీష్ పేర్కొన్నారు. నగరంలోని ఎస్కేపీడీ చారిటీస్ నిర్వహిస్తున్న బాలుర ప్రాథమిక, మహోన్నత పాఠశాలల 107వ వార్షికోత్సవం శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగింది. పాఠశాలల కరస్పాండెంట్ ఎస్ఎల్ సుదర్శనం అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో ప్రాథమిక, మహోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇ.రమేష్, ఓ.లీలారాణి వార్షిక నివేదికలు సమర్పించారు. ముఖ్యఅతిథి డా.సతీష్ రూ.25వేల విరాళంతో పాటు ప్రతి ఏడాది విద్యార్థులకు ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్కేపీడీ ధర్మకర్త కొల్ల వెంకటచంద్రశేఖర్, ట్రస్టీలు ఊటుకూరు శరత్‌కుమార్, దేసు లక్ష్మీనారాయణ, బద్రీనాథ్, సీఆర్ కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.





ఆత్మబంధువు అస్తమయం

నేడు నారావారిపల్లెలో అంత్యక్రియలు
హాజరు కానున్న నారా, నందమూరి కుటుంబీకులు

- చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు మృతితో తల్లడిల్లుతున్న నారావారిపల్లె

తిరుపతి, ఆంధ్రజ్యోతి

నారావారిపల్లె తల్లడిల్లుతోంది. సుదీర్ఘకాలంగా అనారోగ్యంతో వున్న నారా రామ్మూర్తినాయుడు కన్నుమూసిన వార్త తెలిసి కన్నీరుమున్నీరవుతోంది. ఈ వార్త తెలిసినప్పటి నుంచీ బంధుమిత్రులు పెద్దసంఖ్యలో నారావారిపల్లెకు చేరుకుంటున్నారు. ఆయనతో అనుబంధాన్ని గుర్తుచేసుకుంటున్నారు. ఒకరినొకరు ఓదార్చుకుంటున్నారు. హైదరాబాద్ నుంచి ఆదివారం ఉదయం రానున్న భౌతికకాయం కోసం ఎదురుచూస్తున్నారు.

కుటుంబం

ఖర్జూరనాయుడు, అమ్మణ్ణమ్మల మూడో బిడ్డ నారా రామ్మూర్తినాయుడు. వీరికి నలుగురు పిల్లలు. అందరిలోకీ పెద్ద చంద్రబాబు. తర్వాత హైమావతి, ఆమె తర్వాత రామ్మూర్తి నాయుడు, ఆయన తర్వాత రాజేశ్వరి. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ చదువుతూ మధ్యలో ఆపేశారు. శ్రీకాళహస్తి సమీపంలోని కోబాక గ్రామానికి చెందిన ఇందిరతో పెళ్లయ్యింది. వీరికి ఇద్దరు కుమారులు గిరీష్, రోహిత్. రోహిత్ సినిమా హీరోగా ప్రసిద్ధులు. గిరీష్ గల్ఫ్‌లో వ్యాపారవేత్తగా ఉన్నారు. పదహైదేళ్లుగా అనారోగ్యంతో ఉన్న రామమూర్తినాయుడు 72 ఏళ్ల వయసులో కన్ను మూశారు.

నేడు నారావారిపల్లెలో అంత్యక్రియలు

రామ్మూర్తినాయుడు భౌతిక కాయం ఆదివారం ఉదయం 8 గంటలకు హైదరాబాదు నుంచి విమానంలో రేణిగుంట విమానాశ్రయం చేరుకోనుంది. అక్కడి నుంచి రోడ్డు మార్గాన 9.30 గంటలకు నారావారిపల్లె తరలిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు అంత్యక్రియలు నిర్వహిస్తారు. సీఎం చంద్రబాబు సహా నారా, నందమూరి కుటుంబసభ్యులు పలువురు అంత్యక్రియలకు హాజరు కానున్నారు. వీరితో పాటు ఏపీ, తెలంగాణల నుంచి వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యే అవకాశముంది.

1994లో చంద్రగిరి విజేత

రామ్మూర్తినాయుడు 1992 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. అప్పటిదాకా అన్న చంద్రబాబునాయుడికి చేదోడుగానే ఉండేవారు. చంద్రగిరిలో మణిమంతు నాయుడు, ఎల్బీ ప్రభాకర్ వంటి నాయకులున్నా 1994లో టీడీపీ అధినేత ఎన్టీ రామారావు ఆశీస్సులు రామ్మూర్తినాయుడికే లభించాయి. చంద్రగిరి ఎమ్మెల్యే టికెట్ దక్కించుకున్న ఆయన ఆ ఎన్నికల్లో గల్లా అరుణకుమారిపై 16వేలకు పైగా ఆధిక్యంతో గెలిచారు. చంద్రగిరి, పాకాల, పులిచెర్ల, ఐరాల మండలాలతో కూడిన చంద్రగిరి నియోజకవర్గంలో రాజకీయంగా ఆయన నూతన ఒరవడి సృష్టించారు. కార్యకర్తలకు పూర్తి సమయం అందుబాటులో ఉండేవారు. ప్రజలతోనూ, కార్యకర్తలతోనూ కలుపుగోలుగా వుండేవారు. మీడియా ప్రతినిధులను సైతం అన్నా, తమ్ముడూ, మామా అంటూ వరుసలు పెట్టి పిలిచేవారు. కేవలం సిఫారసు లేఖలు ఇవ్వడంతో సరిపెట్టుకోకుండా అధికారుల వెంటపడి మరీ ఆ పనులు అయ్యేదాకా పట్టుదలగా వ్యవహరించేవారు. చంద్రగిరి నియోజకవర్గంలో కమ్మ, రెడ్డి సామాజికవర్గాల ప్రాబల్యం అధికంగా వున్నప్పటికీ రెండు కులాల మధ్యా ఎలాంటి తేడా చూపకుండా వారికి దగ్గరయ్యారు. సీఎం చంద్రబాబు సోదరుడిననే అహం ఇసుమంతైనా చూపే వారు కాదు. ఇతర పార్టీల నేతలతో కూడా కలుపుగోలుగా మెలిగారు.

కాణిపాకం మాస్టర్‌ప్లాన్ మూలకర్త

చంద్రగిరి ఎమ్మెల్యేగా రామ్మూర్తినాయుడు కాణిపాకం వినాయక ఆలయ అభివృద్ధికి మూలకారకుడిగా పేరు తెచ్చుకున్నారు. 1994కు మునుపు ఆలయమూ, ఆలయానికి వెళ్ళే రోడ్డు ఇరుకైన స్థలంలో ఉండేవి. విస్తరణకు వీలు లేని విధంగా చుట్టూ వ్యవసాయ భూములు, ప్రైవేటు నివాసాలు, దుకాణాలు వుండేవి. రామ్మూర్తినాయుడు ఎమ్మెల్యే అయ్యాక దేవాదాయ, రెవెన్యూ, పంచాయతీ అధికారులతోపాటు ఉభయదారులతో కలసి ఆలయ విస్తరణకు, అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ఆలయం చుట్టూ భూములున్న రైతులు, సొంతదారులను ఒప్పించి భూములను సేకరించి ఆలయాన్ని విశాలంగా విస్తరించారు. అలాగే చిత్తూరు-ఐరాల రోడ్డులోని అగరంపల్లె వద్ద ప్రధాన స్వాగత తోరణం నిర్మించారు. అక్కడి నుంచి కాణిపాకానికి డబుల్ రోడ్డు నిర్మించారు. ఆలయంలో ఆర్జిత సేవలనూ మెరుగుపరిచి భక్తులు పెరిగేందుకు కారకులయ్యారు. అప్పటికి ఎన్నో ఏళ్ళుగా తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్న ఆలయ సిబ్బందిని రెగ్యులర్ ఉద్యోగులుగా సర్వీసు క్రమబద్ధీకరణ చేయించారు. ఇవాళ కాణిపాకం ఆలయం రాష్ట్రంలోని 6-ఏ కేటగిరీ ఆలయాలు ఆరింటిలో ఒకటిగా వుండడానికి రామ్మూర్తినాయుడే కారణమని చెప్పవచ్చు.

అనుచరులకు అండగా

తన వెన్నంటివున్నవారికి బలమైన అండగా ఉండేవారు. పన్నెండేళ్ళకు పైగా తనవద్ద డ్రైవరుగా పనిచేసిన నాగరాజుకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని అనుకున్నారు. ఆయన దానికి బదులు చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మ ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ పదవి తనకు ఇప్పించాలని కోరారు. నియోజకవర్గంలో ప్రధాన ఆలయమైనప్పటికీ రామ్మూర్తి నాయుడు ఆ పదవిని నాగరాజుకు ఇప్పించారు.

1999లో మలుపు తిరిగిన జీవితం

చంద్రగిరి ఎమ్మెల్యేగా 1994-99 నడుమ విజయవంతంగా పనిచేసిన రామ్మూర్తినాయుడు రాజకీయ, వ్యక్తిగత జీవితం 1999 ఎన్నికల్లో ఓటమి తర్వాత మలుపు తిరిగింది. 1999-2004 నడుమ ఆయన రాజకీయంగా సంక్షోభాన్ని ఎదుర్కొన్నారు. 1999 ఎన్నికల్లో టీడీపీ తరపున రెండో పర్యాయం పోటీ చేసిన ఆయన కేవలం 2271 ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. నియోజకవర్గంలో కొందరు టీడీపీ ముఖ్య నాయకులు ఆయన గెలుపునకు సహకరించలేదన్న ఆరోపణలు అప్పట్లో వచ్చాయి. ఓటమి తర్వాత ఆయనకు పార్టీలో ప్రాధాన్యం తగ్గుతూ వచ్చింది. తదుపరి ఎన్నికల్లో టికెట్ దక్కే పరిస్థితి లేదని తెలియడంతో 2003లో ఆయన టీడీపీని వీడారు. చంద్రబాబును రాజకీయంగా దెబ్బ తీయడానికి రామ్మూర్తినాయుడిని వాడుకునే వ్యూహానికి కాంగ్రెస్ పార్టీ పెద్దలు యత్నించారు. ఆయన్ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నప్పటికీ 2004 ఎన్నికల్లో చంద్రగిరి అసెంబ్లీ టికెట్ ఇవ్వలేదు. దీంతో ఆయన కాంగ్రెస్ నుంచీ బయటికొచ్చారు. అప్పట్లో తిరుపతి బాలాజీ కాలనీ కూడలిలో కాంగ్రెస్ అధినేత సోనియా కటౌట్‌లు తగులబెట్టడం సంచలనం రేపింది. ఆ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి టీడీపీ కంటే ఎక్కువ ఓట్లు సాధించి నియోజకవర్గంలో తన బలాన్ని చాటారు. కాంగ్రెస్ అభ్యర్థి గల్లా అరుణకుమారికి 46,838 ఓట్లు రాగా, రామ్మూర్తి నాయుడుకు 36 వేల ఓట్లు వచ్చాయి. టీడీపీ అభ్యర్థికి 32 వేల ఓట్లు పడ్డాయి.



2020 మార్చి 18న తన జన్మదినం సందర్భంగా భార్య ఇందిర, కుమారులు రోహిత్, గిరీష్‌తో రామ్మూర్తి నాయుడు

15 ఏళ్ల అనారోగ్యం

1999 ఓటమి తదనంతర పరిణామాలలో తీవ్ర మానసిక క్షోభకు గురయ్యారు. ఆ క్రమంలోనే అనారోగ్యానికి లోనయ్యారు. క్రమేపీ అల్జిమర్స్ లక్షణాలతో కుటుంబీకులను, పరిచయస్తులను గుర్తించలేకపోయారు. చంద్రబాబు చొరవ తీసుకుని కేరళలో ఆయుర్వేద వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. దీంతో ఇంటికే పరిమితమయ్యారు. గత పదిహేనేళ్ళుగా చంద్రబాబు, రామ్మూర్తినాయుడు కుటుంబాలు రెండూ ఆయనను జాగ్రత్తగా కనిపెట్టుకుంటూ వచ్చాయి. అనారోగ్యానికి వయోభారం తోడు కావడంతో పరిస్థితి దిగజారింది. వారం రోజుల కిందట హైదరాబాదులోని ఏఐజీ ఆస్పత్రిలో చేర్పించడంతో చికిత్స తీసుకుంటూ శనివారం ఉదయం కన్నుమూశారు.

సీఎం సొంతూరులో భారీ భద్రత

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో ఆదివారం రామ్మూర్తినాయుడి అంత్యక్రియల నేపథ్యంలో పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. శనివారం మధ్యాహ్నమే ఎస్పీ సుబ్బరాయుడు గ్రామానికి చేరుకుని అక్కడ తీసుకోవాల్సిన బందోబస్తు చర్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు, సీఎం బంధువులతో సమావేశమయ్యారు. సీఎంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, టీడీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరవుతుండడంతో భద్రతా చర్యలపై దృష్టి పెట్టారు. ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ రవి మనోహరాచ్చారి, తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, తిరుపతి, చంద్రగిరి పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. సీఎం నివాసం వద్ద ఏర్పాట్లను ఎస్పీ పర్యవేక్షిస్తున్నారు. నారావారిపల్లెకు వెళ్లే అన్ని రహదారుల వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. డీఐజీతో పాటు ఎస్పీ సుబ్బరాయుడు, అదనపు ఎస్పీలు నలుగురు, 10 మంది డీఎస్పీలు, 30 మంది సీఐలు, 100 మంది ఎస్ఐలు, మరో 200 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 800 మంది కానిస్టేబుళ్లు, రిజర్వు బలగాలు, డాగ్, బాంబు నిర్వీర్యం స్క్వాడ్‌లు, రోప్ పార్టీలు, రోడ్డు డిగ్గింగ్ సిబ్బంది, మెటల్ డిటెక్టర్ టీమ్‌లు బందోబస్తు విధుల్లో ఉన్నారు. మరోవైపు పోలీసు అధికారులతో ఎస్పీ సుబ్బరాయుడు అత్యవసర సమావేశం నిర్వహించారు. భౌతిక కాయం వద్దకు అనుమతి ఉన్న వారినే పంపేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వీఐపీలు, ప్రముఖులు, పార్టీల నాయకులు, బంధువులు, ఇతర అనుచరులకు వేర్వేరుగా షామియానాలు ఏర్పాటు చేశారు. కలెక్టర్ అనుమతి మేరకు మాత్రమే భౌతికకాయం వద్దకు పంపాలని, మిగిలిన వారిని సందర్శన నిమిత్తం కొంత దూరం నుంచే పంపేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



నారావారిపల్లెలో సీఎం ఇంటి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, కమిషనర్

నారావారిపల్లెలో ఏర్పాట్లు

చంద్రగిరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెకు ఆదివారం ఉదయం నారా రామ్మూర్తినాయుడి భౌతికకాయం రానుంది. మధ్యాహ్నం అంత్యక్రియలు జరగనున్నాయి. రామ్మూర్తినాయుడు కుటుంబ సభ్యులతో పాటు సీఎం చంద్రబాబు, మంత్రులు, నారా, నందమూరి కుటుంబ సభ్యులు, కూటమి నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరుకానున్నారు. దీంతో శనివారం సాయంత్రం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి కార్పొరేషన్ కమిషనరు మౌర్య, పలువురు జిల్లా అధికారులు నారావారిపల్లెలో ఏర్పాట్లను పరిశీలించారు. అంత్యక్రియల ఏర్పాట్లను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పర్యవేక్షిస్తున్నారు.

నేడు ప్రముఖుల రాక

- నారావారిపల్లె రానున్న సీఎం చంద్రబాబు, మహారాష్ట్ర గవర్నర్, వీఐపీలు

తిరుపతి(కలెక్టరేట్/నేరవిభాగం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో ఆదివారం నారా రామ్మూర్తినాయుడు భౌతిక కాయానికి నివాళులర్పించడానికి వీవీఐపీలు రానున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు హైదరాబాదు నుంచి ఉదయం పది గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ్నుంచి రోడ్డు మార్గాన స్వగ్రామానికి చేరుకుని తమ్ముడి అంత్యక్రియల్లో పాల్గొంటారు. మంత్రి నారా లోకేశ్ కూడా ఉదయం 5.15 గంటలకు ఏఐజీ ఆస్పత్రికి చేరుకుంటారు. అక్కడ్నుంచి 6గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని ప్రత్యేకవిమానంలో 7.45 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 8.30 గంటలకు నారావారిపల్లెకు చేరుకుంటారని కలెక్టర్ వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే, మహారాష్ట్ర గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్ ఉదయం 9.45గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ్నుంచి నారావారిపల్లె చేరుకుని రామ్మూర్తి భౌతికకాయానికి నివాళులు అర్పిస్తారు. 11.45 గంటలకు తిరుగు ప్రయాణమై పద్మావతి అతిథి గృహానికి చేరుకుంటారు. సాయంత్రం 4గంటలకు విమానంలో బెంగళూరు వెళతారు. ఇంకా, రాష్ట్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ప్రముఖులు హాజరుకానున్నారు.

చిత్తూరు జిల్లాతో మంచి అనుబంధం



రామ్మూర్తి నాయుడితో ఐరాల మండల నాయకులు (ఫైల్ ఫొటో)

చిత్తూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడికి చిత్తూరు జిల్లాతో మంచి అనుబంధం ఉంది. ఆయన చంద్రగిరి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆ నియోజకవర్గంలో ఐరాల, పులిచెర్ల మండలాలు ఉండేవి. దీంతో ఈ రెండు మండలాల అభివృద్ధిలో తన ముద్రవేశారు.

చిత్తూరు నాయకులతో దోస్తీ..

చంద్రగిరి ఎమ్మెల్యేగా ఉన్నా.. లేకున్నా.. రామ్మూర్తి నాయుడికి చిత్తూరు నాయకులతో దోస్తీ ఉండేది. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు విజయ డెయిరీ ప్రెసిడెంట్‌గా తొలిసారి పోటీ చేసినప్పుడు రామ్మూర్తి నాయుడు ఇక్కడే మకాం వేసి ఆయన గెలుపు కోసం కృషి చేశారు. అలాగే, ఏఎస్ మనోహర్‌కు 1995లో మున్సిపల్, 1999లో ఎమ్మెల్యే ఎన్నికల కోసం వెన్నంటే ఉంటూ ప్రచారం చేశారు. 2014లో సత్యప్రభ ఎన్నికల్లో కూడా ఆరోగ్యం సహకరించకపోయినా చిత్తూరుకు వచ్చి తన వంతు కృషి చేశారు.

ఏఎస్ మనోహర్ విజయం కోసం..

1994 సాధారణ ఎన్నికల్లో చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన ఏఎస్ మనోహర్‌ను.. రెండు నెలల తర్వాత 1995 జనవరిలో జరిగిన చిత్తూరు మున్సిపల్ చైర్మన్‌గా అధిష్ఠానం అవకాశం కల్పించింది. ఆ ఎన్నికలకు చంద్రబాబు ఆదేశాలతో చంద్రగిరి ఎమ్మెల్యే హోదాలో రామ్మూర్తి నాయుడు చిత్తూరులో ఏఎస్ మనోహర్ గెలుపు కోసం పనిచేశారు. బయటి వ్యక్తి ఇక్కడికి వచ్చి హల్‌చల్ చేస్తున్నారంటూ అప్పటి ఎస్పీ త్రిపాఠి అడ్డుకోబోతే.. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు ఇంట్లో రామ్మూర్తి నాయుడు ఉండిపోయారు. ఆ ఎన్నికల్లో ఏఎస్ మనోహర్ రాష్ట్రంలోనే అత్యధికంగా 26వేల ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి జ్యోతినాథ్, స్వతంత్ర అభ్యర్థి సీకే లావణ్యపై గెలిచారు. అలాగే ఏఎస్ మనోహర్ 1999లో ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడూ ప్రచారంలో పాల్గొన్నారు.



రామ్మూర్తి నాయుడిని సన్మానిస్తున్న మద్దిపట్లపల్లె చౌదరి (ఫైల్ ఫొటో)

పులిచెర్లలో ఇలా..

1994-99 మధ్య చంద్రగిరి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పులిచెర్ల మండలంలోని కల్లూరు పోలీస్‌స్టేషన్, ప్రభుత్వాస్పత్రి, టీటీడీ కళ్యాణమండపం తదితర నూతన భవనాలను నిర్మించారు. మండలానికి చెందిన తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామనాథం నాయుడు, టీటీడీ మాజీ పాలకమండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్‌తో పాటు ప్రముఖ పారిశ్రామికవేత్త స్వర్గీయ వారణాసి మధుసూదన్‌రెడ్డి, టీడీపీ సీనియర్ లీడర్ స్వర్గీయ లంకిపల్లె మణిమంతునాయుడితోనూ సన్నిహితంగా ఉండేవారు.

టీడీపీ నాయకుల నివాళి



కల్లూరులో రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టీడీపీ నేతలు

కల్లూరు/ సోమల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని నాలుగు రోడ్ల కూడలిలో రామ్మూర్తి నాయుడి చిత్రపటానికి శనివారం టీడీపీ నాయకులు నివాళి అర్పించారు. తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామనాథం నాయుడు మాట్లాడుతూ.. కార్యకర్తలతో, నాయకులతో స్నేహ భావంతో మెలిగేవారని గుర్తు చేసుకున్నారు. నాయకులు కుమార్‌రెడ్డి, నారాయణస్వామి నాయుడు, నూర్‌బాషా, రమేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు. ● సోమల బస్టాండు కూడలిలోనూ టీడీపీ నాయకులు నివాళి అర్పించారు. మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, నాయకులు హరిప్రసాద్, శ్రీనివాసులు నాయుడు, శివశంకర్, ఉమాపతి నాయుడు, మహేంద్రబాబు, సుబ్రమణ్యం యాదవ్, వేణుగోపాల్ నాయుడు, సూరిశెట్టి సుధాకర్, పి.శ్రీనివాసులు, బాలాజీ నాయుడు, వైవీ సుబ్బయ్యశెట్టి, రమేశ్‌నాయుడు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంతాపం తెలిపిన ఎంపీ, ఎమ్మెల్యే

చిత్తూరు సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నారా రామ్మూర్తి నాయుడి మృతిపట్ల టీడీపీ నేతలు శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. వీరిలో.. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు సురేంద్రకుమార్, సప్తగిరి ప్రసాద్, రాష్ట్ర తెలుగుమహిళ ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, మాజీ మేయర్ కటారి హేమలత, పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ తదితరులు ఉన్నారు.

భానుప్రకాష్ శ్రద్ధాంజలి



నగరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రామ్మూర్తి నాయుడి మృతదేహానికి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ శ్రద్ధాంజలి ఘటించారు. హైదరాబాదులోని ఏఐజీ వైద్యశాలలో మృతి చెందిన రామ్మూర్తి నాయుడి భౌతికకాయాన్ని శనివారం ఆయన సందర్శించి, కుటుంబీకులను పరామర్శించారు.

● ఆత్మీయుల మాట

నన్ను కచ్చితంగా కలిసేవారు



1988 నుంచి రామ్మూర్తి నాయుడితో నాకు మంచి అనుబంధం ఉంది. విజయ డెయిరీ ఛైర్మన్ ఎన్నికల్లో నన్ను గెలిపించడానికి కృషి చేశారు. 1994లో ఆయన ఎమ్మెల్యేగా చంద్రగిరిలో పోటీ చేసినప్పుడు నేను ఆయన కోసం ప్రచారం చేశాను. చిత్తూరుకు ఎప్పుడు వచ్చినా కచ్చితంగా నన్ను కలిసి వెళ్లేవారు. భోళా శంకరుడు. ఏదీ మనసులో దాచుకోడు. ఆయన మరణం నన్ను తీవ్రంగా కలచివేసింది.

- దొరబాబు, మాజీ ఎమ్మెల్సీ, చిత్తూరు

ఐరాల మండలం ఓ వెలుగు వెలిగింది



కాణిపాకం ఆలయం ఈ స్థాయిలో అభివృద్ధి చెందిందటే రామ్మూర్తి నాయుడే కారణం. కాణిపాకమే కాదు, ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఐరాల మండలం అభివృద్ధి విషయంలో ఓ వెలుగు వెలిగింది. కాణిపాకం అభివృద్ధిలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు దగ్గరుండి పరిహారం ఇప్పించారు. మా ఊర్లో గుడి కట్టించేందుకు ఆదికేశవులుతో మాట్లాడి నిధులు సమీకరించారు. చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ డైరెక్టర్‌గా నన్ను.. కట్టమంచి సురేంద్రరెడ్డిపైన పోటీ చేయించి గెలిపించారు. ఆయన హయాంలో నేను సర్పంచిగానూ పనిచేశాను. చివరి వరకూ ఆయనతో అనుబంధం ఉంది. శనివారం కూడా నేను నారావారిపల్లెలో ఏర్పాట్లు చూసుకుంటున్నాను.

- చౌదరి, మద్దిపట్లపల్లె, ఐరాల మండలం

అభివృద్ధి కోసం నిరంతరం తపించేవారు



రామ్మూర్తి నాయుడు చంద్రగిరి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గం అభివృద్ధి కోసం నిరంతరం తపించేవారు. నాయకులు, కార్యకర్తలతో స్నేహభావంతో మెలిగేవారు. ఆయనతో నాకు మంచి అనుబంధం ఉంది.

- రామనాథం నాయుడు, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పులిచెర్ల

కాలేజీ రోజుల నుంచే స్నేహం



రామ్మూర్తి నాయుడు, తిరుపతి మాజీ ఎమ్మెల్యే మోహన్, నేను తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో కలిసి చదువుకున్నాం. 1994లో మా ముగ్గురికీ ఎన్టీఆర్ ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారు. వారిద్దరూ గెలిస్తే.. నేను స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయాను. 1995లో జరిగిన మున్సిపల్, 1999 నాటి ఎమ్మెల్యే ఎన్నికల్లో నాకోసం తీవ్రంగా కృషి చేశారు. 2004-09 మధ్యకాలంలో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు హైదరాబాదులో రెగ్యులర్‌గా కలిసేవాళ్లం. కాలేజీ నుంచి మొదలైన స్నేహం రాజకీయాల్లోనూ కొనసాగింది. ఎవరెళ్లినా కాదనకుండా సాయం చేసే మంచి మనిషి.

- ఏఎస్ మనోహర్, మాజీ ఎమ్మెల్యే

కాణిపాకంలో మూడు ఆలయాలకు మహాకుంభాభిషేకం



వరదరాజస్వామి ఆలయ కుంభాభిషేకం సందర్భంగా అయ్యంగార్లతో రామ్మూర్తి నాయుడు (ఫైల్ ఫొటో)

ఐరాల(కాణిపాకం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంపై రామ్మూర్తి నాయుడు చెరగని ముద్ర వేశారు. ప్రధాన ఆలయానికి అనుబంధంగా మణికంఠేశ్వర స్వామి ఆలయం, వరదరాజ స్వామి ఆలయాలను పునః నిర్మించి, వాటికి మహాకుంభాభిషేకం నిర్వహించిన ఘనత ఆయనదే దక్కింది.